
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా వార్తలు

సోమవారం 30 సెప్టెంబరు 2024 | 5





తీరంలో జోరుగా..

యానాం మద్యం విక్రయాలు

ఆంధ్రా ఆదాయానికి గండికొడుతున్న అక్రమ రవాణాదారులు

పలు గ్రామాల్లో యథేచ్ఛగా..

ప్రభుత్వ మద్యం దుకాణాలకు అక్కడ చోటే లేదు..!

పట్టించుకోని అధికారులు


● (కాట్రేనికోన)

తీర గ్రామాల్లో యానాం మద్యం విక్రయాలతో రాష్ట్రానికి కోట్లలో నష్టం జరుగుతున్నట్టు వినికిడి. ఇటీవల కాలంలో మద్యం అక్రమ రవాణాపై నిఘా కొరవడింది. ఎదుర్లంక చెక్‌పోస్టు వద్ద సంబంధిత అధికారులు ఉండకపోవడం గమనార్హం. సమీపంలోనే పోలీసు స్టేషన్ ఉన్నా పట్టించుకోవడంలేదు. దీంతో యానాం మద్యం రవాణాకు అడ్డూఅదుపూ లేకుండా పోయింది. పట్టపగలే యానాం నుంచి మద్యాన్ని ముమ్మిడివరం, కాట్రేనికోన, అమలాపురం తదితర ప్రాంతాలకు వాహనాల ద్వారా నిరాటంకంగా తరలిస్తున్నారు. కాట్రేనికోన మండలంలోని తీరగ్రామాలకు రోడ్డు మార్గం ద్వారానే కాకుండా గోదావరి పాయల ద్వారా బోట్లలో యానాం మద్యం పెద్ద మొత్తంలో చేరుతోంది.

కొత్త మద్యం విధానాన్ని అమల్లోకి తీసుకువచ్చేందుకు కూటమి ప్రభుత్వం సిద్ధపడుతుండగా ఈ లోపు ఇదే అదునుగా భావించి అక్రమ మద్యం విక్రేతలు రెచ్చిపోతున్నారు. యానాం మద్యం వ్యాపారం మూడు క్వార్టర్లు ఆరు ఫుల్స్‌గా సాగుతోంది. ఎక్సైజ్, పోలీసు అధికారులు చేతులెత్తేయడంతో వ్యాపారులు గేట్లెత్తేశారు. కేంద్ర పాలిత ప్రాంతం యానాంలో చౌకగా దొరుకుతున్న మద్యాన్ని ఆంధ్రాకు తరలించి వ్యాపారం చేయడంతో రాష్ట్ర ఆదాయానికి గండి పడుతోంది.

బలుసుతిప్ప కేంద్రంగా..

బలుసుతిప్ప ప్రధాన కేంద్రంగా ఇతర ప్రాంతాలకు ఈ మద్యం విక్రయాలు జరుగుతున్నాయి. ఎక్కడా దొరకని ఖరీదైన అన్ని రకాల బ్రాండ్ల మద్యం తీరగ్రామాల్లో లభ్యం కావడం విశేషం. అక్టోబరు నుంచి మద్యం నూతన విధానానికి రంగం సిద్ధం కావడంతో తీర గ్రామాల్లో రెండు, మూడు నెలల కాలానికి మద్యం వ్యాపార నిర్వహణకు తాత్కాలిక వేలం పాటలు నిర్వహించారు. బలుసుతిప్ప, పల్లం, మొల్లేటిమొగ, కొత్తపాలెం, పొర, చిర్రయానాం తదితర గ్రామాల్లో లక్షల్లో వేలం పాటలు పాడుకుని అక్రమ మద్యంతో ప్రభుత్వ ఆదాయానికి లక్షల్లో గండి కొడుతున్నారు.



ఆరోగ్యంతో చెలగాటం

యానాం నుంచి నాసిరకం మద్యం కొనుగోలు చేసి ఇక్కడ అధిక ధరలకు విక్రయించి, ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు. నిరక్షరాస్యులైన తీరగ్రామాల ప్రజలు నాసిరకం మద్యం సేవించి రోగాల బారిన పడుతున్నారు. ఇంత జరుగుతున్నా సంబంధిత అధికారులు నోరు మెదపకపోవడం వెనుక ఆంతర్యమేమిటన్నది ప్రశ్నగా మారింది.

ప్రభుత్వ దుకాణాలకు ఇక్కడ చోటు లేదు!

మత్స్యకారులు అత్యధికంగా ఉన్న బలుసుతిప్ప, పల్లం గ్రామాల్లో ప్రభుత్వ మద్యం దుకాణాలు పెట్టే అవకాశం ఉన్నా ఆ దిశగా ప్రయత్నాలు జరగడంలేదు. ఇక్కడ దుకాణాల ఏర్పాటుకు ఎక్సైజ్ అధికారులు అడ్డుపుల్ల వేస్తున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధుల వైఖరి కారణంగానే అక్రమ మద్యం వ్యాపారం అడ్డులేకుండా సాగుతోందన్న ఆరోపణలున్నాయి. తీరగ్రామాల్లో మద్యం వేలం పాటల ద్వారా వచ్చే లక్షల రూపాయలను కేవలం పోలీసులకు, జాతరలకు మాత్రమే వినియోగిస్తారు తప్ప గ్రామాభివృద్ధికి ఒక్క రూపాయి కూడా వెచ్చించరు. గతంలో ఇక్కడ దుకాణాల ఏర్పాటుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినా రాజకీయ లబ్ధి కోసం ప్రజాప్రతినిధులు అడ్డుకట్ట వేశారన్న ఆరోపణలున్నాయి. ప్రభుత్వం ఏ మద్యం పాలసీని అమలు చేసినా తీరగ్రామాల్లో మాత్రం వేలం పాటల తీరుమారదు. ప్రభుత్వాలు మారినా నాయకులు మారడం తప్ప మద్యం వేలం పాటలు మామూలే. తీరగ్రామాల తీరు కారణంగానే మద్యం టెండర్లు వేసేందుకు కాంట్రాక్టర్లు భయపడుతున్నారంటే పరిస్థితి ఎలా ఉందో ఊహించుకోవచ్చు. ఒక మాదిరి మత్స్యకార గ్రామాల్లో ఏడాదికి రూ.10 నుంచి రూ.20లక్షల వరకు పెద్ద గ్రామాల్లో రూ. 50లక్షల నుంచి రూ.కోటి వరకు వేలం పాటలకు సిద్ధమవుతున్నారు. కొత్త విధానంలోనైనా తీర గ్రామాల్లో ప్రభుత్వ మద్యం దుకాణాలు ఏర్పాటు చేసి నాసిరకం మద్యానికి అవకాశం లేకుండా ప్రజల ప్రాణాలకు రక్షణ కల్పించాలని స్థానికులు కోరుతున్నారు.

పైప్‌లైన్ ధ్వంసం

మూడు రోజులుగా ఆరు గ్రామాలకు అందని తాగునీరు

మరమ్మతుల్లో తీవ్ర జాప్యం



పైప్‌లైన్ మరమ్మతులు నిర్వహిస్తున్న దృశ్యం

ఉప్పలగుప్తం, సెప్టెంబరు 29: చల్లపల్లి ఆర్‌డబ్ల్యూఎస్ మెయిన్ పైప్‌లైన్ వాడపర్రులో ధ్వంసం కావడంతో ఆరు గ్రామాలకు మూడు రోజులుగా తాగునీటి సరఫరా నిలిచిపోయింది. ఈ నెల 27న పైప్‌లైన్ దెబ్బతినగా ఇప్పటి వరకు పూర్తి స్థాయిలో మరమ్మతులు జరగలేదు. దీనికి కారణం అవసరమైన సామగ్రి అందుబాటులో లేకపోవడమే. పైప్‌లైన్ దెబ్బతిన్న చోట విద్యుత్ స్తంభాలున్నందున కొంత దూరం అదనపు పైప్‌లైన్ ఏర్పాటు చేయాల్సిన ఆవశ్యకత ఏర్పడింది. పనిచేసేందుకు సిబ్బంది ఉన్నప్పటికీ అవసరమైన సామగ్రి సిద్ధంగా లేనందున జాప్యం జరుగుతోంది. పైప్‌లైన్ వివిధ కారణాల వల్ల ఎప్పుడైనా దెబ్బతినే అవకాశాలుంటాయి. ముందుగానే కాంట్రాక్టర్ అవసరమైన పరికరాలను సిద్ధం చేసుకోవాలి. మరమ్మతుల సమయంలో సామగ్రిని వేరే ప్రాంతాల నుంచి తేవాలంటే రోజుల వ్యవధి పడుతుంది. వాడపర్రు పైప్‌లైన్ విషయంలో ఇదే జరిగిందని గ్రామాల సర్పంచ్‌లు ఆరోపిస్తున్నారు. అధికారులు, కాంట్రాక్టర్ నిర్లక్ష్యం కారణంగా పైప్‌లైన్లలో సాంకేతిక ఇబ్బందులు ఏర్పడినప్పుడు రోజుల తరబడి నీటి సరఫరా నిలిచిపోతోందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఆదివారం రాత్రికి కూడా పైప్‌లైన్ మరమ్మతులు పూర్తికాలేదు. నీటి సరఫరాకు ఎంత వ్యవధి పడుతుందో తెలియదని, నీటి కోసం ప్రజలు ఇక్కట్లు పడుతున్నారని సర్పంచ్‌లు ఆవేదన చెందుతున్నారు. పైపల కోసం కాకినాడ పంపించామని, అవి వచ్చిన వెంటనే పైప్‌లైన్ పని పూర్తిచేస్తామని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సురేష్ తెలిపారు.

వార్త..7లో

అదిగో పులి!

చిరుతపులి సంచారంపై పుకార్లు షికార్లు



పరిశీలిస్తున్న అధికారులు



లంకలగన్నవరంలో గతంలో నిర్వహించిన బోట్స్‌మెన్ ఇసుక ర్యాంపు

పి.గన్నవరం ఓఎన్‌జీసీ రేవులో నిర్వహించిన బోట్స్‌మెన్ ర్యాంపు

ఇంకా కొరతే..

● (పి.గన్నవరం)

ఇసుక ఇక్కట్లు

జిల్లాలో ఇసుక కొరతతో ఇబ్బందులు తప్పడం లేదు. మధ్యలో నిర్మాణాలు నిలిచిపోతున్నాయి. ఇసుక ర్యాంపులు అన్నీ ఖాళీగా కనిపిస్తున్నాయి. బోట్స్‌మెన్ ర్యాంపులు తెరిస్తే ఇసుక కొరత ఉండదని భావిస్తున్నారు. అయితే అధికారులు మాత్రం అటువైపు కన్నెత్తి కూడా చూడడం లేదు.. ప్రభుత్వం ఏర్పడిన తర్వాత కొద్ది రోజులుకే గోదావరి వరదనీరు రావడంలో బోట్స్‌మెన్ ర్యాంపులతో పాటు ఓపెన్ ర్యాంపులు సైతం మూతపడ్డాయి. ప్రస్తుతం గోదావరి వరద తగ్గుముఖం పట్టినప్పటికి కనీసం బోట్స్‌మెన్ ర్యాంపుల్లోనైనా ఇసుకను తీసేందుకు అధికారులు ఆయా ప్రాంతాలలో పరిశీలన చేపట్టలేదు. ఇప్పటికే కూటమి ప్రభుత్వం ఉచిత ఇసుక విధానాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకుని ఆన్‌లైన్‌ను పూర్తిస్థాయిలో అమల్లోకి తీసుకు వచ్చింది. అయితే కోనసీమ జిల్లాలో రావులపాలెం, కొత్తపేట తదితర మండలాల్లో ఇప్పటి వరకు అందుబాటులో ఉన్న ఇసుక నిల్వలు సైతం పూర్తికావడంతో ఇసుక కొరత జిల్లాను పట్టిపీడిస్తోంది. ఇసుక కొరతతో పలు చోట్ల భవన నిర్మాణాలు సైతం ఆగిపోయాయి. ఇసుక కొరత కారణంగా భవన నిర్మాణాలు ఆగిపోవడంతో నిర్మాణ కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

వైసీపీ హయాంలో ఇసుక గగనం

వైసీపీ ప్రభుత్వ హయాంలో ఇసుక బంగారమైంది. సామాన్యుడికి అందని ద్రాక్షలా మారింది. గోదావరి తీరాల్లో అడ్డగోలుగా ఇసుక, మట్టి తవ్వకాలు జరిపి కోట్లాది రూపాయల ప్రకృతి సంపదను దోచుకున్నారు. దీంతో అప్పట్లో ప్రతిపక్షాల నేతలు ర్యాంపులు సందర్శించి నిరసనలు చేపట్టినప్పటికి తగ్గేదేలె అన్నట్టుగా బహిరంగంగా తవ్వకాలు జరిపారు. సామాన్యుడు ట్రాక్టరు ఇసుక కొనుగోలు చేయాలంటే భయపడిపోయేవారు. కనీస నిబంధనలు పాటించకుండా తీర ప్రాంతాలలో తవ్వకాలు జరిపినప్పటికి అధికారులు కూడా పట్టించుకునేవారు కాదు. ఈ సమయంలో అప్పటి కూటమి నేతలు తీపి కబురు చెప్పారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే ఇసుకను ఉచితంగా ఇస్తామని చెప్పారు. అయితే ఇప్పుడు ఇసుక గగనమైపోయింది.

వైసీపీ హయాంలో ఓపెన్ ర్యాంపులో టన్ను రూ.475లు, బోట్స్‌మన్ ర్యాంపులో రూ.600 చొప్పున వసూలు చేసేవారు. కానీ నిబంధనలకు విరుద్ధంగా సామాన్యులకు అందుబాటులో లేకుండా ఇసుక ఇతర ప్రాంతాలకు ఎక్కువగా తరలించేవారు. స్థానికులు అధిక ధరలకు ఇసుకను కొనుగోలు చేయాల్సి వచ్చేది. అయితే ప్రస్తుతం జిల్లాలో ఇసుక నిల్వలు పూర్తిగా కరిగిపోవడంతో దళారులు దాచిపెట్టిన ఇసుక నిల్వలకు రెక్కలు వచ్చాయి. లారీ ఇసుక రూ.30 వేలు, ట్రాక్టర్ ఇసుక రూ.6 వేలకు విక్రయిస్తున్నట్లు బహిరంగంగానే చెప్పుకుంటున్నారు. అయితే సామాన్యుడు ఆ ధరలతో ఇసుకను కొనలేకపోవడంతో నిర్మాణాలు ముందుకు సాగడం లేదు.



నిలిచిన నిర్మాణాలు

జిల్లాలో ఇసుక కొరతతో ఇబ్బందులు

మధ్యలో నిలిచిపోయిన నిర్మాణాలు

బోట్స్‌మెన్ ర్యాంపులు అన్నీ ఖాళీ

ఇప్పటివరకు పరిశీలించని అధికారులు

ర్యాంపుల మూత

జిల్లాలో పి.గన్నవరం, ఆలమూరు, కపిలేశ్వరపురం, ఆత్రేయపురం, రావులపాలెం, మండపేట తదితర మండలాల్లో ఓపెన్ ర్యాంపులు నడిచేవి. అయితే గోదావరి వరదలు కారణంగా ఆయా ర్యాంపులు తెరిచే అవకాశం లేదు. ప్రస్తుతం పి.గన్నవరం, రాజోలు, అల్లవరం, మామిడికుదురు, కాట్రేనికోన, అయినవిల్లి తదితర మండలాల్లో బోట్స్‌మెన్ ర్యాంపులు తెరిచే అవకాశం ఉంది. గత ప్రభుత్వంలో సుమారుగా 20 బోట్స్‌మెన్ ర్యాంపులు నడిచాయని చెబుతున్నారు. ఆయా బోట్స్‌మెన్ ర్యాంపులు తెరిస్తే ఇసుక కొరత కొంతమేర తీరనుంది.

ర్యాంపుల పరిశీలన ఇలా..

ఓపెన్, బోట్స్‌మెన్ ర్యాంపులను సైతం నిబంధనలు అనుసరించి సంబంధిత అధికారులు పరిశీలన చేయాలి. అయితే బోట్స్‌మెన్ ర్యాంపుల అనుమతులు నిమిత్తం ఇప్పటికే జిల్లాలో పలు ఫిషర్‌మెన్ అండ్ బోట్స్‌మెన్ సాండ్ సొసైటీల సభ్యులు జిల్లా కలెక్టర్‌కు దరఖాస్తు చేసుకున్నారు. అయితే సంబంధిత దరఖాస్తులను ఉమ్మడి పరిశీలన చేయాల్సి ఉంది. రెవెన్యూ, హెడ్‌వర్క్స్, మైన్స్, భూగర్భ జలశాఖ, ఇరిగేషన్ తదితర శాఖల ఆధ్వర్యంలో సంబంధిత అధికారులు ర్యాంపులను సంయుక్త పరిశీలన చేయాల్సి ఉంది. స్థానికులు అభ్యంతరాలను పరిగణలోకి తీసుకుని సంబంధిత నివేదికలను జిల్లా కలెక్టర్‌కు అందిస్తారు. అనంతరం కలెక్టర్ ఆదేశాలతో మైన్స్ అధికారులు ర్యాంపుల్లో జియో కోఆర్డినేట్ ద్వారా హద్దులు నిర్దేశించి ఎంతమేర ఇసుక తవ్వకాలు జరపాలో నిర్దేశిస్తూ అనుమతులు ఇస్తారు. కానీ ఇప్పటి వరకు బోట్స్‌మెన్ ర్యాంపులను సంబంధిత అధికారులు పరిశీలన చేసిన దాఖలాలు లేవు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక



ఉప్పలగుప్తం, సెప్టెంబరు 29: గొల్లవిల్లి ఉన్నత పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థినులు అండర్-17 విభాగంలో ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా తరఫున ఎస్‌జీఎఫ్ రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలకు ఎంపికైనట్టు హెచ్‌ఎం లంక రాణి తెలిపారు. నూకల రేవతీదివ్యభాను హాకీ, దోనిపాటి మౌనిక ఫుట్‌బాల్ పోటీలకు ఎంపికైనట్టు వివరించారు. హెచ్‌ఎంతో పాటు పీఎంసీ చైర్మన్ వాలా సత్యనారాయణ, పీడీ గొలకోటి ఫణీంద్రకుమార్, కూటమి నాయకులు బాలికలను అభినందించారు.



కల్యాణం నిర్వహిస్తున్న పండితులు

అంతర్వేదిలో ఘనంగా శాంతి కల్యాణం

ప్రత్యేకాలంకరణలో స్వామి,అమ్మవారు

అధిక సంఖ్యలో తరలివచ్చిన భక్తజనం

అంతర్వేది, సెప్టెంబరు 29: అంతర్వేదిలో కొలువై ఉన్న శ్రీలక్ష్మీనరసింహస్వామివారి ఆలయంలో ఆదివారం స్వామి-అమ్మవార్ల కల్యాణం అత్యంత వైభవంగా జరిగింది. తొలుత ఆలయ పురాతన కల్యాణ మండపం వద్ద ప్రత్యేక సింహాసనంపై స్వామి-అమ్మవార్లను ఆశీనులు చేసి ప్రత్యేక అలంకరణ చేశారు. అనంతరం అర్చక స్వాములు కల్యాణ తంతు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో కల్యాణంలో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఆలయం భక్తులతో కిటకిటలాడింది. అనంతరం స్వామివారి నిత్యాన్నదానంలో భక్తులు అన్న ప్రసాదం స్వీకరించారు.

నేడు గ్రీవెన్స్ యథావిధిగా..

అమలాపురం టౌన్, సెప్టెంబరు 29: కలెక్టరేట్‌లోని గోదావరి భవన్‌లో సోమవారం ఉదయం 10 గంటల నుంచి ప్రజా సమస్యల పరిష్కార వేదిక గ్రీవెన్స్ కార్యక్రమం యథావిధిగా జరుగుతుందని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. ఫిర్యాదుదారులు తమ సమస్యలను జిల్లా యంత్రాంగం దృష్టికి తీసుకువచ్చి పరిష్కార మార్గాలు పొందాలని కోరారు.



ఆపదలో అండగా.. 112

మహిళల రక్షణ కోసం యాప్

అత్యవసర పరిస్థితుల్లో 'తోడు'గా..

అమలాపురం రూరల్, సెప్టెంబరు 29: మహిళల రక్షణ కోసం ఎన్ని చట్టాలు చేసినా నిత్యం ఎక్కడో ఒకచోట ఏదో ఒక అఘాయిత్యం జరుగుతూనే ఉంది. ఇలాంటి ఘటనలను నివారించేందుకు కేంద్ర ప్రభుత్వం మరింత ప్రత్యేక శ్రద్ధ తీసుకుంది. దీనిలో భాగంగా మహిళలు, యువతులు, బాలికల రక్షణ కోసం దేశ వ్యాప్తంగా నూతన యాప్‌ను అందుబాటులోకి తీసుకువచ్చింది. 112 ఇండియా పేరుతో కేంద్రం యాప్‌ను ప్రవేశపెట్టడంతో ఆపద వేళ మహిళలకు ఎంతో రక్షణగా నిలుస్తుందనడంలో సందేహం లేదు. డయల్ 100 తరహాలో పనిచేసే ఈ యాప్‌పై మహిళలు, యువతులకు మరింత అవగాహన పెంపొందించాల్సిన పరిస్థితి ఉంది. ప్రధానంగా లైంగిక వేధింపులకు గురయ్యే బాలికలు, అత్యవసర పరిస్థితుల్లో రక్షణ కోసం మహిళలు ఈ యాప్‌ను ఉపయోగించుకునే విధంగా ప్రత్యేకంగా తీర్చిదిద్దారు.

Google Play

డౌన్‌లోడ్ ఇలా..

మహిళల రక్షణ కోసం అందుబాటులోకి తీసుకువచ్చిన 112 ఇండియా యాప్‌ను స్మార్ట్ ఫోన్‌లోని ప్లేస్టోర్‌లోకి వెళ్లి డౌన్‌లోడ్ చేసుకోవాలి. ప్లేస్టోర్‌లో 112 ఇండియా యాప్ అని టైప్ చేయగానే అక్కడ ప్రత్యక్షమవుతుంది. యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని ఓపెన్ చేయగానే మన రాష్ట్రం, వినియోగదారుని పేరు, ఫోన్ నంబరును నమోదు చేయాల్సి ఉంటుంది. ఈ యాప్ కనెక్ట్ అవుతుంది. దానిపై క్లిక్ చేయగానే మనమిచ్చే ఫోన్ నంబరుకు వచ్చే ఓటీపీని నమోదు చేసి వెరిఫై క్లిక్ చేస్తే లోకేషన్ అడుగుతుంది. అనంతరం ఆ పేజీ తెరుచుకుంటుంది. అప్పుడు మళ్లీ పేరు, పుట్టినతేదీ, జెండర్ తదితర వివరాలను నమోదుచేసి సబ్మిట్ చేస్తే ఆ యాప్ డౌన్‌లోడ్ అవుతుంది.



మహిళల రక్షణ కోసం..

దేశంలో, రాష్ట్రంలో మహిళలు ఎక్కడ ఉన్నప్పటికీ 112 నంబరుకు డయల్ చేయగానే వెంటనే రక్షణ చేకూరుతుంది. తొలుత యాప్ తెరవగానే పోలీసు, ఫైర్, మెడికల్, విపత్తు, మహిళలు, ఇలా అనేక ఆప్షన్లు కనిపిస్తాయి. మనకు అవసరమైన దానిని ఓపెన్ చేసి అత్యవసర వివరాలు నమోదు చేసి పోలీసుపై క్లిక్ చేయాలి. వెంటనే ఆ వివరాలన్నీ మన లోకేషన్ ఆధారంగా పోలీసులు వెంటనే అక్కడకు చేరుకుని రక్షించేందుకు ఆస్కారం ఉంటుంది. అమెరికాలో 911 తరహాలోనే దేశ వ్యాప్తంగా ఒకే అత్యవసర నంబరు ఉండాలని కేంద్ర ప్రభుత్వం భావించి 112ను అందుబాటులోకి తీసుకువచ్చారు. త్వరలోనే ఈ నంబరు అందరికీ పూర్తిస్థాయిలో అందుబాటులోకి రానుంది.



కొత్త మద్యం షాపులు 502?

- ఉమ్మడి జిల్లాకు కేటాయిస్తారని అంచనా ● జనాభా ఆధారంగా లైసెన్స్ ఫీజు
- 10 వేలు లోపు ఉంటే రూ.50 లక్షలు ● 5 లక్షల జనాభా దాటితే రూ.85 లక్షలు
- గీతకార్మికులకు 52 షాపులు ● నేడో రేపో నోటిఫికేషన్ విడుదల
- అక్టోబరు 15 తరువాత ప్రైవేటు షాపులు ● మళ్లీ తెరుచుకున్న ఎక్సైజ్ స్టేషన్లు

రాజమహేంద్రవరం, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): మందుబాబులకు మంచిరోజులు రానున్నాయి. అక్టోబరు మూడో వారంలో ప్రైవేటు మద్యం షాపులు తెరుచుకునే అవకాశం ఉంది. పాత బ్రాండ్లు మందుబాబులకు అందుబాటులోకి వస్తాయి. కొత్త మద్యంషాపుల సంఖ్య, లైసెన్సు రుసుం పై మంత్రివర్గ ఉపసంఘం సిఫార్స్‌ల ఆధారంగా ఇప్పటికే కూటమి ప్ర భుత్వం ఓ నిర్ణయానికి వచ్చినట్టు తెలుస్తోంది. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాకు 502 ప్రైవేటు మద్యం షాపులు రానున్నాయి. నూతనం గా ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ వింగ్ ఏర్పాటు కానుంది. ఈమేరకు ఆ విభాగానికి సంబ ంధించి పోస్టులను సృష్టించారు. మద్యం అక్రమాలు, నాటుసారా, మాదక ద్రవ్యాలను అరికట్టడంపైనే ఈవిభాగం దృష్టి సారిస్తోంది.

గాడిలో ఎక్సయిజ్

వైసీపీ ప్రభుత్వం ఎక్సైజ్‌శాఖను అతలాకుతలం చేసిన విషయం తెలిసి ందే. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత నాసిరకం మద్యానికి తెరదించ డానికి చర్యలు చేపట్టింది. ఇప్పటికే ఐదేళ్ల నుంచీ కనుమరుగైన అంతర్జాతీయ కంపెనీలకు చెందిన ఐబీ, ఎంసీ విస్కీలు క్వార్టర్ రూ.180కే అందుబాటులోకి వచ్చాయి. మద్యం విధానాన్ని ప్రక్షాళన చేసే పనిలో భాగంగా కూటమి ప్రభుత్వం సెబ్‌ని రద్దుచేసి ఎక్సైజ్‌కి పూర్తిస్థాయి అధికారాలు కట్టబెట్టి బదిలీలు మొదలుపెట్టింది. ఇకపై మద్యం అమ్మకాలను ఏపీఎస్‌బీసీఎల్ అధికారులు చూస్తారు. మద్యం అమ్మకాలు, అక్రమాలపై ఎక్సైజ్ అధికారులు విధులు నిర్వహిస్తారు. సెబ్ రద్దయిన తర్వాత తూర్పుగోదావరి జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్‌గా నియమితులైన సీహెచ్ లావణ్య విధుల్లో చేరారు. అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్‌గా నాగరాహాల్ వస్తున్నారు. ఎక్సైజ్ సూపరింటెండెంట్ కార్యాలయానికి బొమ్మూరు వైటీసీలో ఓ చిన్న గదిని కేటాయించారు. ఇక్కడి నుంచి కార్యకలాపాలు కష్టమైన పని. అందువల్ల కలెక్టర్ అనుమతితో ఈఎస్ నివాసంతోపాటు ఈఎస్, ఏఈఎస్ కార్యాలయాలకు ప్రైవేటు భవనం వెతుకుతున్నారు.

నేడో రేపో నోటిఫికేషన్

పలు రాష్ట్రాల్లో అధ్యయనం మేరకు మంత్రివర్గ ఉప సంఘం సిఫార్స్ నివేదిక ప్రభుత్వానికి వెళ్లింది. దీని ఆధారంగా ప్రభుత్వం కొత్తమద్యం పాలసీపై నిర్ణయాలు తీసుకుంటోంది. నేడో రేపో కొత్త మద్యం పాలసీపై నోటిఫికేషన్ వెలువడే అవకాశం కనిపిస్తోంది. తూర్పుగోదావరి జిల్లాలో 146 మద్యం షాపులకు 16 గీత కార్మికులకు రిజర్వు చేశారు. మొత్తం 162 షాపులకు నోటిఫికేషన్ ఇవ్వనున్నారు. కాకినాడ జిల్లాలో 154 మద్యం షాపులకు 17 గీత కార్మికులకు రిజర్వు చేశారు. మొత్తం 171 షాపులు కేటాయించనున్నారు. కోనసీమజిల్లాలో 150 మద్యం షాపులకు 19 గీత కార్మికులకు రిజర్వు చేశారు. మొత్తంగా 169 షాపులు కేటాయిస్తారు. ఉమ్మడి జిల్లాలో 502 షాపులు ఏర్పాటు చేయనున్నారు. ఎక్సైజ్ శాఖలోని 'జీరో' బదిలీల్లో భాగంగా అందరికీ స్థాన మార్పిడి జరుగుతోంది. సెబ్ నుంచి మాతృశాఖకు వచ్చిన 80మందితో సహా అందరినీ బదిలీ చేస్తు న్నారు. బదిలీ అవుతున్న వారిని వెంటనే రిపోర్టు చేయాల్సిందిగా ఆదేశిస్తున్నారు. దీంతో దాదాపు పది నుంచి 15 రోజుల్లో ప్రైవేటు మద్యం షాపులు అందుబాటులోకి రానున్నాయని తెలుస్తోంది.

కొత్తగా ప్రైవేటు మద్యం షాపులు రానున్నాయి. జగన్ పిచ్చి మందు మరో 15 రోజుల్లో కనిపించకుండాపోతోంది. అంతర్జాతీయ కంపెనీలు తయారు చేసే బ్రాండ్లు(పాత బ్రాండ్లు) రానున్నాయి. జగన్ ప్రభుత్వంలో ప్రభుత్వ మద్యంషాపులు కావడంతో అమ్మిందే మందుగా చలామణీ అయ్యింది. ఇప్పుడు ప్రైవేటు షాపులు రానుండడంతో పోటీ పెరగనుంది. ఈ షాపుల్లో అన్నిబ్రాండ్లూ అందుబాటులో ఉంటాయి. ఎలాంటి అక్రమాలకూ తావు ఇవ్వకూడదని కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. సాధారణంగా ఎంఆర్పీ కంటే ఎక్కువకు అమ్మడం, పెగ్గుల్లో తేడా, బ్రాండ్ మిక్సింగ్ వంటివి జరుగుతుంటాయి. వీటిని అరికట్టేందుకు పలు జిల్లాలకు ప్రత్యేకంగా ఎన్‌ఫోర్స్‌మెంట్ వింగ్ ఏర్పాటు చేశారు. దీనికి జిల్లా అధిపతిగా ఉన్నతాధికారి ఉంటారు. తూర్పుగోదావరిజిల్లాకు ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్

ఎన్‌ఫోర్స్‌మెంట్ వింగ్

అసిస్టెంట్ కమిషనర్, అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరి ంటెండెం ట్, ఇన్‌స్పెక్టర్, ఎస్ఐ, సిబ్బందితో కలిపి సుమారు 15మందితో ఓ విభాగం ఉంటుంది. మద్యం అమ్మకాల్లో అక్రమాలు, నాటుసారాను అరికట్టడం, మాదకద్రవ్యాల పనిపట్టడంపైనే ఈ వింగ్ పనిచేస్తోంది. ప్రధానంగా ప్రొహిబిషన్, ఎక్సైజ్, ఎన్‌డీపీఎస్ చట్టాల కింద కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తారు. ఈ విభాగం విజయవాడలోని ఎక్సైజ్ కమిషనర్‌కి జవా బు దారీగా ఉంటుంది. అందువల్ల స్థానిక అధికారుల ప్రమేయం ఉండ దు. దీంతో అక్రమాలకు అడ్డుకట్ట వేయవచ్చని ప్రభుత్వం భావిస్తోంది. ఈ నేపథ్యంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగానికి కూడా కార్యాలయం ఏర్పాటు అవసరం ఉంది.

లైసెన్స్ ఫీజు ఇలా..

స్థానిక సంస్థ(యూఎల్‌బీ)ల్లోని జనాభా ఆధారంగా మొదటి ఏడాది లైసెన్సు ఫీజును ఖరారు చేస్తారు. జిల్లా కేంద్రమైన రాజ మ హేంద్ర వరంలో మొదటి ఏడాది లైసెన్సు ఫీజు రూ..85 లక్షలుగా నిర్ణయించే అవకాశం ఉంది. వాస్తవానికి 5లక్షల పైబడి జనాభా ఉంటే రూ.85 లక్షలుగా లైసెన్సు రుసుం ఉండే విధంగా స్లాబులు ప్రతిపాదించారు. రెండేళ్లపాటు మనుగడలో ఉండే లైసెన్సుకు 2011జనాభాను ప్రాతిపదికగా తీసుకొని 2024కి పెరుగుదల అంచనా వేస్తారు. దానికి అనుగుణంగా లైసెన్సు ఫీజు నిర్ణయిస్తారు. ఈ మేరకు ఈనెల 18న ఉత్తర్వులు వెలువ డ్డాయి. వాటి ప్రకారం ఉమ్మడి తూర్పులో 2024కి అంచనా వేసిన జనా భా సంఖ్య, లైసెన్సు ఫీజు ఈ క్రింది విధంగా ఉండే అవకాశం ఉంది. నిడదవోలు 543, రామచంద్రాపురం కేవలం 368మంది జనాభా అంచ నాలో పెరుగుదలవల్ల స్లాబు మారిపోయి 50 వేల సంఖ్యను దాటడంతో రూ.10 లక్షల లైసెన్సు ఫీజు పెరిగిపోయింది.

ఊరు	2011జనాభా	2024అంచనా	లైసెన్సు ఫీజు
కాకినాడ	325855	375945	రూ.65లక్షలు
పెద్దాపురం	49477	57083	రూ.65లక్షలు
తుని	53425	61637	రూ.65లక్షలు
ఏలేశ్వరం	32084	37016	రూ.55లక్షలు
సామర్లకోట	56864	65605	రూ.65లక్షలు
పిఠాపురం	52360	60409	రూ.65లక్షలు
గొల్లప్రోలు	23882	27553	రూ.55లక్షలు
అమలాపురం	53231	61414	రూ.65లక్షలు
రామచంద్రాపురం	43657	50368	రూ.65లక్షలు
మండపేట	53633	61877	రూ.65లక్షలు
ముమ్మిడివరం	25355	29253	రూ.55లక్షలు
రాజమండ్రి	579802	668929	రూ.85లక్షలు
కొవ్వూరు	39667	45765	రూ.55లక్షలు
నిడదవోలు	43809	50543	రూ.65లక్షలు

.. 10 వేల లోపు జనాభా ఉంటే రూ.50 లక్షలు, 50 వేల లోపు అయితే రూ.55 లక్షలు, 5 లక్షల లోపు అయితే రూ.65 లక్షలు, 5 లక్షలు దాటితే రూ.85 లక్షలు, స్థానిక సంస్థల జనాభా ఆధారంగా 2011 జనాభా తీసుకుని 2024కి ఎంత పెరిగి ఉండొచ్చనే అంచనా

అబ్బో తాడిచెట్టూ...

తాడి చెట్టు జమ్మలభాగం నుంచి వచ్చిన మొక్కలు



గేదెల్లంక ఉత్తర వాహినిలో తాడిచెట్టు జమ్మ లు(ఆకు మొదలు భాగం) నుంచి మొక్కలు వస్తున్న దృశ్యం



ముమ్మిడివరం, సెప్టెంబరు 29: తాడి చెట్టు జమ్మలు (ఆకు మొదలు భాగం) నుంచి మొక్కలు వచ్చి పలువురిని ఆకర్షిస్తున్నాయి. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ముమ్మిడివరం మండలం గేదెల్లంక గ్రామంలోని ఉత్తరవాహిని నదీతీరంలో ఐదు లేదా ఆరు సంవత్సరాల వయసు గల తాడిచెట్టు జమ్మల భాగం నుంచి సుమారు పది వరకు కొమ్మలుగా వచ్చాయి. దీంతో స్థానికులు దీన్ని వింతగా భావిస్తున్నారు. ఉత్తరవాహిని గోదావరినదీ చెంతన శివుని విగ్రహం సమీపంలో ఉన్న తాడిచెట్టుకు ఈవిధంగా జమ్మల నుంచి కొమ్మలు రావడం వింతగా ఉంది. గ్రామంలోని పలువురు తాడిచెట్టును చూసి ఆశ్చర్యం వ్యక్తంచేస్తున్నారు. సాధారణంగా కొబ్బరిచెట్టుకుగానీ తాడిచెట్టుకుగానీ నాలుగు లేదా మూడు తలలు ఏర్పడడం సహజం. ఇతరజాతి మొక్కలకైతే శాఖోపశాఖలుగా మొక్కలు వస్తాయి. తాడిచెట్టు జమ్మల భాగంనుంచి మొక్కలు రావడాన్ని చిత్రంగా భావిస్తున్నారు.

చీరమేను వచ్చేసింది..

- యానాం మార్కెట్లో పెద్ద క్యారేజ్ 5,300, చిన్న క్యారేజ్ 3,500



యానాం మార్కెట్లో వేలంపాటలో పెట్టిన చీరమేను

యానాం, సెప్టెంబరు 29: యానాంలో మార్కెట్లోకి చీరమేను వచ్చేసింది. యానాం, గోదావరి జిల్లా వాసులకు, మాంసాహార ప్రియులు ఎంతో ఇష్టంగా తినే చీరమేను శీతకాలం ప్రారంభంలో, ఎక్కువగా దీపావళి ముందుగా దొరుకుతుంది. ముఖ్యంగా తూర్పుగాలుల సమయంలో చీరమేను మత్స్యకారులకు దొరుకుతుంది. తూర్పుగాలుల సమయంలో నీటి అడుగుభాగం నుంచి ఊపరితలం (నీటిపైకి)మీద కు చేరుకుంటాయి. ఇవి చాలా చిన్నగా వేళ్ల సందులు, వలలోంచి జారిపోయేంత చిన్నగా ఉండటంతో గతంలో చీరలతో మాత్రమే పట్టేవారు. కాలక్రమేనా వాటికి సంబంధించిన చిన్నచిన్న వలలు రావడంతో వాటితో ఇప్పుడు పట్టుకుంటున్నారు. ఆదివారం సాయంత్రం యానాం మార్కెట్‌లోకి రెండు క్యారేజ్‌ల చీర మేను వచ్చింది. దీనిని మార్కెట్‌లో చేపలు విక్రయించే నాటి పార్వతి పెద్ద క్యారేజ్ రూ.5300లకు, చిన్న క్యారేజ్ రూ.3500లకు పాటలో దక్కించుకున్నారు.

రావులపాలెంలో చిరుత కలకలం

- గౌతమి గోదావరి లంకల్లో చిరుత కనిపించిందంటూ హల్‌చల్

రావులపాలెం, సెప్టెంబరు 29: రావులపాలెం గౌతమి వంతెన సమీపంలోని లంకల్లో చిరుత కనిపించిందంటూ ఆదివారం సోషల్ మీడియాలో ప్రచారం హల్‌చల్ చేసింది. ఈ ప్రచారాన్ని అధికారులు కొట్టిపారేశారు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో కొంతకాలం నుంచి చిరుత పులి సంచారంతో ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్న సంగతి తెలిసిందే. ఆదివారం తెల్లవారుజామున చేపలవేటకు వెళ్లిన మత్స్యకారులు గంగరాజు, వెంకటేశ్వరరావు గౌతమి వంతెన సమీపంలోని లంకల్లో చిరుత పులి కనిపించిందని చెప్పినట్లు సోషల్ మీడియాలో ప్రచారం జరిగింది. దీంతో అప్రమత్తమైన అధికారులు ఆ ప్రాంతంలో పరిశీలించారు.

వదంతులు నమ్మొద్దు.. డీఎఫ్‌వో ప్రసాద్

చిరుతపులి సంచారమంటూ వస్తున్న వదంతులను నమ్మొద్దని డీఎఫ్‌వో ప్రసాద్ అన్నారు. చిరుతపులి కనిపించిందని ప్రచారం జరుగుతున్న ప్రాంతంలో పరిశీలించగా అక్కడ ఎటువంటి ఆధారాలు లభ్యం కాలేదన్నారు. అయితే సోమవారం ఉదయం పూర్తిస్థాయిలో మరోసారి పరిశీలిస్తామని వదంతులు నమ్మొద్దని ఆయన తెలిపారు.



చిరుత కలకలంతో రావులపాలెం గౌతమి వంతెనపై గుమ్మిగూడిన వాహనదారులు, ప్రయాణికులు

వేట్లపాలెంలో పట్టపగలే చోరీ

- రూ.15 లక్షల విలువైన బంగారపు అభరణాలు, లక్ష నగదు అపహరణ

సామర్లకోట, సెప్టెంబరు29: కాకినాడ జిల్లా సామర్లకోట మండలం వేట్లపాలెం గ్రామంలో బేతాళగుడి వెనుక జొన్నలదొడ్డికి వెళ్లే రోడ్డులో గుణ్ణం సాయిబాబు ఇంట్లో ఆదివారం పట్టపగలే ఉదయం పది పదిన్నర మధ్యలో ఇంట్లో ఎవరూ లేని సమయంలో తలుపులు తెరిచి బీరువాలోని 200 గ్రాముల బంగారపు ఆభరణాలు, రూ.లక్ష నగదును దొంగలు దోచుకుపోయారు. జనసమర్ధంగల వీధిలో పట్టపగలే ఈ భారీ చోరీ జరగడంతో గ్రామం అంతటా ఉలిక్కిపడింది. వివరాల్లోకి వెళితే ఇంటి యజమాని సాయిబాబు తమ ఇంటి పక్కవీధిలో ఒక కుటుంబాన్ని పరామర్శించేందుకు తలుపుల తాళాలువేసి సుమారు అరగంట అనంతరం ఇంటికి వచ్చేసరికి తలుపులు తెరిచి ఉండడం, బీరువాలోని బాక్సులు చిందరవందరగా ఉండడాన్ని గుర్తించి ఆభరణాలు, నగదు కోసం వెతికినప్పటికీ అవి కనిపించకపోవడంతో అపహరణకు గురైనట్లు సామర్లకోట పోలీసులకు ఫిర్యాదు చేశారు. సామర్లకోట పోలీసులతో బాటూ పెద్దాపురం డీఎస్పీ శ్రీహరిరాజు, సామర్లకోట సీఐ ఏ.శ్రీకృష్ణభగవాన్‌లు సంఘటనకు దారితీసిన పరిస్థితులపై ఇంటి యజమాని, బాధితుడు సాయిబాబు నుంచి సమాచారాన్ని సేకరించారు. కాకినాడ నుంచి పోలీసు జాగిలాలను రప్పించి దర్యాప్తు నిర్వహించారు. ఇంటి వెనుక నుంచి ముగ్గురు గుర్తు తెలియని వ్యక్తులు ఆ సమయంలో వచ్చినట్లు గుర్తించారు. స్థానికులు అందించిన సమాచారాన్ని సైతం పోలీసులు సేకరించారు. సమీప ఇళ్లల్లో ఉన్న సీసీ కెమెరాలలో నిక్షిప్తమైన గుర్తు తెలియని వ్యక్తుల సమాచారాన్ని పోలీసులు సేకరించారు. సీసీ కెమెరాలలో లభించిన సమాచారం మేరకు చోరీకి పాల్పడిన వ్యక్తులు వేట్లపాలెం గ్రామానికి చెందిన వారేనని పోలీసులు ప్రాథమికంగా భావిస్తున్నారు. బాధితుడు సాయిబాబు ఫిర్యాదు మేరకు సామర్లకోట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

80 గ్రాముల బంగారు నగల చోరీ

తొండంగి, సెప్టెంబరు29: కాకినాడజిల్లా తొండంగి మండలం బెండపూడి శివారు గోడేవారి తోటలోని ఒక ఇంట్లో 80 గ్రాముల బంగారు నగలను గుర్తుతెలియని వ్యక్తులు చోరీ చేసినట్లు తొండంగి ఎస్ఐ జగన్మోహన్ తెలిపారు. వివరాల ప్రకారం... విశాఖపట్నంలో కన్సల్టెన్సీ నిర్వహిస్తున్న గంటా జగదీష్ ప్రసాద్ ఈనెల 26న గురువారం కుటుంబ సభ్యులతో కలిసి తిరుపతి యాత్రకు వెళ్లి ఆదివారం తిరిగి వచ్చారు. ఇంటి తాళాలు తెరచి ఉండడంతో పరిశీలించగా అప్పటికే ఇంట్లో ఉన్న బీరువా తాళాలు పగలగొట్టి 80 గ్రాముల బంగారు నగలను గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేసినట్లు కుటుంబ సభ్యులు గుర్తించారు. వీటి విలువ రూ.2లక్షలు ఉంటుందని తెలిపారు. బాధితులు ఇచ్చిన ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు. క్లూస్‌టీం పరిశీలన జరిపిందని, తుని రూరల్ సీఐ చెన్నకేశవరావు సంఘటనా స్థలాన్ని పరిశీలించి తగు సూచనలుచేసి నట్లు జగన్మోహన్ తెలిపారు.

మోటార్‌సైకిల్‌తో చెట్టును ఢీకొని వ్యక్తి మృతి

- పశ్చిమగోదావరి జిల్లాకు చెందిన వ్యక్తిగా గుర్తింపు

గొల్లప్రోలు, సెప్టెంబరు 29: గొల్లప్రోలు పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆదివారం రాత్రి మోటారుసైకిల్ చెట్టు ఢీకొన్న ఘటనలో ఏలూరు జిల్లాకు చెందిన వ్యక్తి మరణించాడు. ఏలూరు జిల్లా లింగంపాలెం మండలం ధర్మాజీగూడేనికి చెందిన అక్కిరాజు శ్రీనివాసరాజు మోటార్‌సైకిల్‌పై కత్తిపూ డి నుంచి పిఠాపురం వైపునకు వస్తున్నాడు. గొల్లప్రోలు బైపాస్ రోడ్డులో రాయవరం జంక్షన్ దాటిన తర్వాత అదుపుతప్పి చెట్టును ఢీకొన్నాడు. రక్తపు గాయాలతో ఉన్న అతడు రోడ్డు పక్కన పడి ఉండడంతో హైవే మొబైల్ పోలీసులు అతడిని పిఠాపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అప్పటికే మరణించినట్లు వైద్యులు తెలిపారు. దీంతో బంధువులకు సమాచారం ఇచ్చినట్లు గొల్లప్రోలు పోలీసులు తెలిపారు.

అర్హులైన క్రీడాకారులకు అన్యాయం

- బాస్కెట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు కనకాల



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న కనకాల

రామచంద్రపురం(ద్రాక్షారామ), సెప్టెంబరు 29: బాస్కెట్‌బాల్ అసోసియేషన్ ఇన్ ఆంధ్రప్రదేశ్ అధ్యక్ష, కార్యదర్శులు టి.చెంగల్రాయుడు, గన్నమని చక్రవర్తిలు అర్హులైన క్రీడాకారులకు అన్యాయం చేస్తున్నారని ఉమ్మడి తూర్పుగోదావరి బాస్కెట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు కనకాల వెంకటేశ్వరరావు, ఇతర కార్యవర్గ సభ్యులు ఆరోపించారు. ఆదివారం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమజిల్లా రామచంద్రపురంలోని రాజగోపాల్ ఫంక్షన్ హాలులో అసోసియేషన్ ఉపాధ్యక్షుడు ఎం.సత్యనారాయణ, కె.పురుషోత్తమరావు, గుబ్బలరాజు, పుప్పాల వెంకటరమణ, కోశాధికారి ఎన్‌వీవీ శ్రీనివాస్‌లతో కలసి ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. బాస్కెట్‌బాల్ అసోసియేషన్ ఇన్ ఏపీ అధ్యక్ష, కార్యదర్శుల వైఖరితో రాష్ట్రంలో అన్ని జిల్లాల్లో అసోసియేషన్లు రెండుగా చీలిపోయాయన్నారు. బాస్కెట్‌బాల్ అసోసియేషన్ ఇన్ ఏపీకి ఏపీ ఒలింపిక్ అసోసియేషన్ గుర్తింపు కూడా లేదన్నారు. నకిలీ జనన ధ్రువీకరణ పత్రాలతో 17 మంది క్రీడాకారులను వివిధ వయస్సు గ్రూపులలో ఆడించి అర్హులైన క్రీడాకారులకు అన్యాయం చేశారని ఆరోపించారు. జనన ధ్రువీకరణ పత్రాలపై సమాచార చట్టం ద్వారా నకిలీ జనన ధ్రువీకరణ పత్రాలుగా నిరూపణ జరిగిందని దీంతో స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఏపీకి ఫిర్యాదు చేసిన గత ప్రభుత్వ పెద్దల అండదండలతో ఎటు వంటి చర్యలు తీసుకోలేదన్నారు. వీటిపై రాష్ట్ర హైకోర్టును ఆశ్రయించామన్నారు. కేసు విచారణలో ఉందని తెలిపారు. ఆదేవిధంగా అమలాపురంలో 2018 ఏప్రిల్‌లో నిర్వహించిన 4వ అంతర్ జిల్లా బాస్కెట్‌బాల్ పోటీలకు సంబంధించి స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఏపీ బాస్కెట్‌బాల్ అసోసియేషన్ ఇన్‌ఏపీ బ్యాంకు ఖాతాకు రూ.1.25లక్షలు నగదు బదిలీ చేసిందన్నారు. సదరు మొత్తం జిల్లా అసోసియేషన్‌కు ఇవ్వకుండా నగదు మంజూరు కాలేదని, వెనక్కి వెళ్లిపోయాయని అసోసియేషన్ సభ్యులు, టోర్నమెంటు నిర్వాహకులను గన్నమని చక్రవర్తి మభ్యపెట్టే ప్రయత్నం చేశారనిఆరోపించారు. బాస్కెట్‌బాల్ అసోసియేషన్ ఇన్ ఏపీకి శాప్ గుర్తింపు 2021తో ముగిసిందన్నారు. శాప్ గుర్తింపులేని అసోసియేషన్స్ ద్వారా 2022-2023 జాతీ యస్థాయి పోటీలలో పాల్గొనే క్రీడాకారులు సర్టిఫికెట్స్ ఏపీలో ఏ విధమైన స్పోర్ట్స్ కోటాకి వర్తించకుండా పోయాయన్నారు. ఎంతో కష్టపడి టోర్నమెంట్లు ఆడిన క్రీడాకారులకు స్పోర్ట్స్ కోటా వర్తించకపోవడానికి కారణం చెంగల్రాయుడు, చక్రవర్తిలో కారణమని ఆరోపించారు. వీరిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

ఏపీ టైలర్స్ రాష్ట్ర అధ్యక్షుడిగా మల్లికార్జునరావు

రాజమహేంద్రవరం సిటీ, సెప్టెంబరు29: ఏపీ టైలర్స్ సొసైటీల సమాఖ్య రాష్ట్ర కార్యవర్గ ఎన్నిక ఆదివారం తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం అన్నపూర్ణమ్మపేటలోని నగర నాయీబ్రాహ్మణ అసో సియేషన్ హాలులో జరిగింది. రాష్ట్ర అధ్యక్షుడిగా పొగులమల్లి మల్లికార్జునరావు(ఒంగోలు), కార్యదర్శిగా డీఎస్ఎస్ సుబ్రహ్మణ్యం (కాకినాడ), కోశాధికారిగా బసవ దుర్గారావు (విజయవాడ)ను ఎన్నుకున్నారు. మిగిలిన కార్యవర్గాన్ని త్వరలో ఎన్నుకుంటామని వారు ప్రకటించారు. అధ్యక్షకార్యదర్శులు మాట్లాడుతూ టైలర్స్ ఫెడరేషన్ ఏర్పాటు కోసం సొసైటీలు ఈ సమావేశం ఏర్పాటు చేసుకుని పలు తీర్మానాలు చేసుకున్నట్టు చెప్పారు. తమ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించే దిశగా రాష్ట్ర నాయకత్వం పనిచేస్తుందన్నారు. కాగా ఈ సమావేశానికి ఏపీ టైలర్స్ కోఆపరేటివ్ సొసైటీలు జిల్లాల వారీగా 206 సొసైటీల వారు హాజరైనట్లు చెప్పా రు. సమావేశంలో పాపారావు, సత్యనారాయణ, దొడ్డి నాగేశ్వరరావు, బత్తుల కొండలరావు, వానపల్లి ప్రసాదరావు, కోనా రమేష్, గంగరాజు, జక్కంశెట్టి స్వామి, కోసన మురళీకృష్ణ, కామేశ్వరరావు, దొంగ సత్యనారాయణ, పీటీ మూర్తి, నెలటూరు సత్యనారాయణ, గోపాలకృష్ణ పాండా, అమీర్ జానీ, పట్టాల అంజిబాబు, ఒంపోలు పోసిబాబు, పడవల సత్యనారాయణ పాల్గొన్నారు.



టైలర్స్ సొసైటీ రాష్ట్ర కార్యవర్గం

చెస్‌లో గోల్డ్‌మెడల్ సాధించిన గంగాధర్



గోల్డ్‌మెడల్‌తో సూరాడ యశస్వి సత్య గంగాధర్

సర్పవరంజంక్షన్, సెప్టెంబరు 29: జాతీయస్థాయి చెస్ పోటీల్లో కాకినాడరూరల్ పి.వెంకటాపురం కేంద్రీయ విద్యాలయ పదో తరగతి విద్యార్థి సూరాడ యశస్వి సత్యగంగాధర్ గోల్డ్‌మెడల్ సాధించాడు. ఇటీవల గుజరాత్ రాష్ట్రం అహ్మదాబాద్‌లో జరిగిన 53వ కేంద్రీయ విద్యాలయాల 2024-25 జాతీయస్థాయి చెస్ స్పోర్ట్స్‌మీట్‌లో యశస్వి సత్య గంగాధర్ పాల్గొన్నాడు. ఈ స్పోర్ట్స్ మీట్‌లో 25 రీజియన్స్ నుంచి సుమారు 120మంది విద్యార్థులు చెస్ పోటీల్లో పాల్గొన్నారు. ఇందులో తెలంగాణా, ఏపీ రీజన్‌కు చెందిన యశస్వి సత్య గంగాధర్ 5 రోజుల పాటు జరిగిన టోర్నీలో 9 రౌండ్లలో 7.5 పాయింట్లు సాధించి మొదటిస్థానంతో జాతీయ స్థాయిలో గోల్డ్‌మెడల్ సాధించాడు. ఇతను గతంలో రెండుసార్లు ఈ జాతీయ టోర్నీలో పాల్గొనగా మొదటిసారి 4వ స్థానం సాధించి స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఎస్‌జీఎఫ్ఐ)కి ఎంపికయ్యాడు. రెండోసారి 5వ స్థానంలో నిలిచాడు. ఈసారి 2024-25 స్పోర్ట్స్ మీట్‌లో పాల్గొని తన మెదడుకి మరింత పదును పెట్టి, చెస్‌లో ఎదుటివారి ఎత్తులకు పై ఎత్తులు వేస్తూ చెక్ పెట్టడంతో జాతీయ స్థాయి చెస్ చాంఫియన్‌గా యశస్వి సత్య గంగాధర్ నిలిచి గోల్డ్‌మెడల్ సొంతం చేసుకున్నాడు. గోల్డ్‌మెడల్ సాధించి కాకినాడ కేంద్రీయ విద్యాలయ పేరు ప్రతిష్టలను జాతీయస్థాయిలో ఇనుమడింపచేసిన గంగాధర్‌ని ప్రిన్సిపాల్ బి. శేఖర్, ఇతర ఉపాధ్యాయులు అభినందించారు.

హాకీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా రవిరాజు



కాకినాడ అర్బన్, సెప్టెంబరు 29: గుంటూరులో ఆదివారం జరిగిన హాకీ రాష్ట్ర సంఘ సమావేశంలో డీఎస్ఏ సీనియర్ హాకీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా నియమితులయ్యారు. ఉప్పాడ కొత్తపల్లి ఉన్నత పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడిగా, వ్యాయామ ఉపాధ్యాయ సంఘ జిల్లా అధ్యక్షుడిగా రవిరాజు సేవలందిస్తున్నారు. ఉమ్మడి జిల్లా హాకీ జట్టు శిక్షకుడిగా 24ఏళ్లగా జట్టు విజయానికి ఆయన కృషి చేస్తున్నారు. ఆయన ఎంపికపట్ల డీఎస్ఏ సీఈవో బి.శ్రీనివాసకుమార్ అభినందనలు తెలిపారు.

అన్నవరంలో19 మంది ఉద్యోగులు బదిలీ

అన్నవరం, సెప్టెంబరు 29: అన్నవరం దేవస్థానంలో ఏఈవో, సూపరింటెండెంట్ క్యాడర్‌లలో ఉన్న 19మంది ఉద్యోగులను అంతర్గత బదిలీలు చేస్తూ ఆదివారం ఈవో రామచంద్రమోహన్ ఉత్తర్వులు జారీ చేశారు. సహాయ కమిషనర్ సీహెచ్ రామ్మోహనరావుకు వ్రతాలు, పరిపాలన విభాగం, ఆలయ విభాగానికి ఏఈవో కొండలరావు, రిసెప్షన్ సూపరింటెండెంట్‌గా బలువు సత్యశ్రీనివాస్, అన్నదాన విభాగ సూపరింటెండెంట్‌గా కృష్ణప్రసాద్, అనకాపల్లి ప్రసాద్‌కు అదనంగా 1500, 2000 వ్రతాలు, పి.వెంకటరమణకు లీజుల విభాగం కేటాయించారు. దేవస్థానం పీఆర్వోగా విజయవాడనుంచి బదిలీపై వచ్చిన వెంకటరెడ్డికి విధులు కేటాయించారు.

నో రిజర్వేషన్



- దూరప్రాంతాల నుంచి స్వస్థలాలకు వచ్చే దారేది
- సంక్రాంతి సమయంలో రైళ్ల రిజర్వేషన్లు ఫుల్
- మూడున్నర నెలల ముందే రిగ్రెట్
- ప్రత్యేక రైళ్లు వేస్తేనే మిగిలిన వారికి అవకాశం
- లేకుంటే బస్సులు, కారుల్లో రావాల్సిందే

సంక్రాంతి పండుగ వచ్చిందంటే చాలు ఎక్కడ ఉన్నా స్వస్థలాలకు వచ్చేందుకే మొగ్గు చూపిస్తారు. అందుకు తగ్గట్టుగానే ముందస్తు ఏర్పాట్లల్లో ఉంటా రు. మూడున్నర నెలలు ముందుగానే రైళ్లల్లో రిజర్వేషన్‌కు అవకాశం ఉండడంతో అం దరూ ముందుగానే బుకింగ్ చేసుకోవడంతో ఆ సమయంలో జిల్లాకు వచ్చే ఏ రైళ్లలోనూ సీట్లు లేవు. కనీసం వెయిటింగ్ లిస్టులో కూడా బుక్ చేసుకునే అవకాశం లేకుండా రిగ్రెట్ చూపిస్తున్నాయి.

పిఠాపురం, సెప్టెంబరు 29: ఏటా సంక్రాంతి పండుగకు హైదరాబాదులో ఉద్యోగాలు, వృత్తి, వ్యాపారాలు రీత్యా స్థిరపడిన వారంతా స్వస్థలాలకు వస్తూ ఉంటారు. కాకినాడజిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన వారు అక్కడ అధికంగా ఉన్నారు. వీరంతా పండుగ వేళ తమ ఇళ్లకు వచ్చి కొన్నిరోజులపాటు కుటుంబసభ్యులు, బంధుమిత్రులతో ఆనందంగా గడిపి వెళ్తూ ఉంటారు. ఇందుకుగాను ముందుగానే ప్లానింగ్ చేసుకుంటారు. ప్రయాణంలో ఇబ్బంది లేకుండా రైళ్లల్లో రిజర్వేషన్లకు అధిక ప్రాధాన్యమిస్తారు. సాధారణంగా పిల్లలతోపాటు పెద్దలకు ఈ సమయంలో సెలవులు ఉంటాయి. అవసరానికి అనుగుణంగా సెలవులు పెట్టుకుని మరీ ఇక్కడా పండుగ జరుపుకునేందుకు వస్తారు. ఈసారి 2025, జనవరి 11వతేదీ శనివారం సెకండ్ సాటర్‌డే, 12వతేదీ ఆదివారం కావడంతో స్వస్థలాలకు వచ్చేవారిలో మరింత జోష్ నింపింది. 10వతేదీ రాత్రి బయలుదేరి 11వతేదీకి స్వస్థలాలకు చేరుకుంటే ఐదు నుంచి గరిష్ఠంగా 8రోజులు గడిపే సమయం ఉండడంతో ఈసారి మరింత ఎక్కువగా స్వస్థలాలకు వచ్చే వారు ఉంటారని భావిస్తున్నారు.

అప్పుడే అన్ని ఫుల్.. రిగ్రెట్

హైదరాబాద్‌నుంచి కాకినాడ జిల్లాలోని కాకినాడ, సామర్లకోట, పిఠాపురం, అన్నవరం, తుని రైల్వేస్టేషన్లల్లో ప్రధాన రైళ్లు ఆగుతాయి. ఈ ప్రాంతాలవారే గాకుండా అన్ని ప్రాంతాల వారు ఈ స్టేషన్లలో దిగి తమ గ్రామాలు, పట్టణాలు చేరుకుంటారు. ఇందుకుగాను వారంతా రైళ్లల్లో రిజర్వేషన్లు ఎప్పుడు ఓపెన్ అవుతాయని ఎదురుచూస్తూ ఉంటారు. నాలుగు నెలలు ముందుగానే రిజర్వేషన్లు చేసుకునే అవకాశం ఉండడంతో టిక్కెట్లు బుకింగ్ ప్రారంభం కాగానే అందరూ ఒకేసారి బుకింగ్ చేయడంతో అన్నిరైళ్లల్లో రిజర్వేషన్లు ఫుల్ అయ్యాయి. గోదావరి, గౌతమి, విశాఖ, గరీబ్‌రథ్, విశాఖ ఎల్‌టీటీ ఎక్స్‌ప్రెస్ రైళ్లలో 10, 11, 12వ తేదీల్లో స్లీపర్, థర్డ్ ఏసీ, ఎకానమీ, సెకండ్ ఏసీ క్లాసుల టిక్కెట్లు ఫుల్ అయి రిగ్రెట్ చూపిస్తున్నాయి. ఇక ఈ తేదీల్లో రిజర్వేషన్లు చేసుకునే వీలు కూడా ఉండదు. 13వతేదీకి వెయిటింగ్ లిస్టు అధికంగానే ఉంది. వీటితోపాటు మహబూబ్‌నగర్-విశాఖ, కోణార్క్, జన్మభూమి, వందేభారత్, కోకనాడ ఎక్స్‌ప్రెస్‌లు, పగటిపూట వచ్చే ఈస్టుకోస్టు, షిర్డీ ఎక్స్‌ప్రెస్‌లు, ఇతర సూపర్‌ఫాస్టు రైళ్లకు 10, 11, 12వ తేదీల్లో టిక్కెట్లు అందుబాటులో లేవు. అత్యధికులు 10, 11, 12వతేదీల్లో వచ్చేందుకే మొగ్గుచూపడం, 10వ తేదీ సాయంత్రం ఆఫీసు ముగియగానే వచ్చే అవకాశం ఉన్న నేపథ్యంలో ఆ తేదీల్లో సాయంత్రం సమయంలో ఉన్న రైళ్లలో రిజర్వేషన్లు రిగ్రెట్ చూపిస్తున్నాయి.

తత్కాల్ లేదా ప్రత్యేక రైళ్లు వేస్తేనే..

రైళ్లల్లో రిజర్వేషన్లు అన్నీ ఫుల్ కావడంతో హైదరాబాదు నుంచి స్వస్థలాలకు వచ్చే వారు ఇతర ప్రత్యామ్నాయాల కంటే రైల్వేశాఖ ప్రకటించే ప్రత్యేక రైళ్లపైనే ఆసక్తి చూపిస్తున్నారు. ప్రయాణం సులభతరంగా ఉండడం, భద్రతా రీత్యా ఇదే మంచిది కావడంతో స్పెషల్ రైళ్లు లేదా తత్కాల్‌లో టిక్కెట్లు తీసుకోవాలని భావిస్తున్నారు. రైళ్లల్లో దొరకకుంటే బస్సుల్లో రావాలని భావిస్తున్నారు. అవీ దొరకకుంటే సొంత వాహనాలపై లేకుంటే ఇక్కడకు వచ్చి తిరిగేందుకు వీలుగా అద్దె వాహనాలు పెట్టుకుని రావాలని యోచిస్తున్నారు. రైళ్లలో రిజర్వేషన్లు వెంటనే అయిపోతాయని భావించలేదని పలువురు ఉద్యోగస్తులు తెలిపారు. ఎన్ని వ్యయప్రయాసలకు గురైనా ఇంటికి వస్తే ఆ ఇబ్బందులు అన్నింటినీ మర్చిపోతామని వారు చెబుతున్నారు. రైల్వేశాఖ సంక్రాంతిని దృష్టిలో ఉంచుకుని కాకినాడ, విశాఖపట్టణం ప్రాంతాలకు ప్రత్యేక రైళ్లు ప్రకటిస్తే హైదరాబాద్‌లో స్థిరపడ్డ తమకు ప్రయోజనకరంగా ఉంటుందని వారు తెలిపారు.

పండుగకు వెళదామని అనుకున్నా

-గొల్లపూడి హరిహర పవన్ సాయిభాస్కర్, విద్యార్థి వ్యాక్సన్ యూనివర్సిటీ, హైదరాబాదు



హైదరాబాదులో బీబీఎమ్ డిజిటల్ మార్కెటింగ్ కోర్సు చేస్తున్నా. ప్రతి ఏటా సంక్రాంతి సెలవులకు మా స్వస్థలమైన గొల్లప్రోలు వెళుతూ ఉంటా. ఈ సారి నాలుగు నెలలు ముందుగానే రైళ్లల్లో రిజర్వేషన్లు అన్ని ఫుల్ అయిపోయాయి. ఇప్పుడు పండుగకు వెళ్లగలనా లేదా అనుకుంటున్నా. బస్సుల్లో ప్రయత్నించాలి.

క్షణాల్లో టిక్కెట్లు అయిపోయాయి

-ఎస్.ప్రణయ్, సాఫ్ట్‌వేర్ ఉద్యోగి, హైదరాబాదు



సంక్రాంతికి ఇంటికి వెళ్లదామని రిజర్వేషన్లు ఓపెన్ కాగానే ప్రయత్నించా. నెట్‌వర్క్ సమస్యతో కలవలేదు. మరలా సైట్ ఓపెన్ అయిన తర్వాత అన్ని వెయిటింగ్ లిస్టును దాటి రిగ్రెట్ చూపిస్తున్నాయి. జనవరి 10,11,12వ తేదీల్లో రిజర్వేషన్‌కు ప్రయత్నిస్తే ఇదే పరిస్థితి ఎదురైంది. బస్సుల్లో ప్రయాణం ఇబ్బందికరంగా ఉంటుంది. ప్రత్యేక రైళ్లు ప్రకటిస్తారని ఎదురుచూస్తున్నా.

కన్యకాపరమేశ్వరి ఆలయంలో శరన్నవరాత్రి ఉత్సవాలు

అంబాజీపేట, సెప్టెంబరు29: అంబాజీపేటబస్టాండ్ వద్దఉన్న శ్రీవాసవి కన్యకాపరమేశ్వరి ఆలయంలో అక్టోబరు 3నుంచి 12వరకు దశమిశరన్నవ రాత్రి ఉత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలి పారు. 3నకన్యకాపరమేశ్వరి అమ్మవారిగా అలంకరణ, 4నగాయత్రిదేవి, 5నఅన్నపూర్ణదేవి, 6నశ్రీలలితాదేవి, 7నశ్రీబాలాత్రిపుర సుందరిదేవి, 8న సరస్వతిదేవి, 9న శ్రీమహాలక్ష్మిదేవి, 10న రాజరాజేశ్వరిదేవి, 11న శ్రీమహిషాసురమర్ధిని, 12నశ్రీవిజయదుర్గాదేవిగా అలంకరిస్తామని కమిటీ సభ్యులు తెలిపారు.

ప్రపంచ హృదయ దినోత్సవం

అమలాపురం టౌన్, సెప్టెంబరు 29: ప్రపంచ హృదయ దినోత్సవాన్ని పురస్కరించుకుని మెడ్ యునైటెడ్ ఆసుపత్రుల ఆధ్వర్యంలో ఆదివారం హెల్త్‌వాక్ నిర్వహించారు. గుండె ఆరోగ్యంపై అవగాహన పెంపొందించడంతో పాటు శారీరక శ్రమ ప్రాముఖ్యతను ప్రచారం చేసేందుకు హెల్త్ వాక్ కార్యక్రమాన్ని చేపట్టారు. మెడ్ యునైటెడ్ ఛైర్మన్ కేవీవీ సత్యనారాయణరాజు(చైతన్యరాజు), ఎండీ కె.రవికిరణ్‌వర్మ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ప్రముఖ గుండె శస్త్ర వైద్య నిపుణులు డాక్టర్ గురుకిరణ్ ముఖ్య అతిథిగా హాజరై గుండె ఆరోగ్యాన్ని ఎలా కాపాడుకోవాలో వివరించారు. కార్యక్రమంలో వప్పుల శ్రీరామచంద్రమూర్తి, షకీల, బోనం సత్యవరప్రసాద్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

సీఎం సహాయనిధి చెక్కుల అందజేత

మలికిపురం, సెప్టెంబరు 29: రాజోలు నియోజకవర్గంలో ఆదివారం పలువురికి సీఎం సహాయనిధి నుంచి మంజూరైన చెక్కులను ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ అందించారు. విశ్వేశ్వరాయపురం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సోంపల్లికి చెందిన ఉండ్రు జాన్‌కు రూ.33వేలు, కరవాకకు చెందిన నందాడి నాగవేణికి రూ.85 వేలు, రాజోలుకు చెందిన వై.ప్రీతికి రూ.2.09లక్షలు చెక్కులను ఆయన అందించారు. కార్యక్రమంలో మార్క్‌ఫెడ్ డైరెక్టర్ గుండుబోగుల పెదకాపు, ఎస్.శ్రీనివాస్, చాగంటి స్వామిపాల్గొన్నారు.

రచయిత్రి విజయభారతికి నివాళి

మామిడికుదురు, సెప్టెంబరు29: పద్మభూషణ్ బోయిన భీమన్న కుమార్తె, బొజ్జా తారకం సతీమణి విజయభారతికి భీమ్ సాహితీ సంస్థ, షెడ్యూల్డు కులాల సంక్షేమ సంఘం, భీమ్ సాహితీ సంస్థ నివాళులర్పించింది. మామిడికుదురులోని బోయి భీమన్న మానవరుల కేంద్రం వద్ద ఆమె చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. సాహితీ సంస్థ అధ్యక్షుడు పొలమూరి విక్రమ్, కలిగితి పల్లంరాజు, మట్టా సత్తిబాబు, గోగి గోపాలకృష్ణ, రొక్కాల వెంకట్రావు, బత్తుల శేఖర్, కలిగితి పెద్దిరాజుపాల్గొన్నారు.

జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానాలు

మామిడికుదురు, సెప్టెంబరు29: జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన మండలానికి చెందిన నయినాల రఘురామయ్య, గెద్దాడ నాగలక్ష్మి, కడలి సత్యనారాయణమూర్తిలను రాజోలు రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో సోంపల్లిలోని ముళ్లపూడి హరిశ్చంద్రప్రసాద్ రోటరీ సేవా మందిరంలో ఆదివారం సన్మానించారు. రోటరీ క్లబ్ అధ్యక్షుడు కాసు శ్రీనివాస్, అసిస్టెంట్ గవర్నర్ బొరుసు వెంకటతిరుమలరావు, కోదాటి సోమరాజు, దార్ల పెదబాబు, కిశ్వర్ మొహిద్దీన్, చిట్నీడి లక్ష్మణరావు, నామన షణ్ముకేశ్వరరావు, కంచర్ల పూర్ణచంద్రరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి రూ.2లక్షల సాయం

పి.గన్నవరం, సెప్టెంబరు 29: కుందాలపల్లి మండల ప్రజాపరిషత్ స్కూలు ఉపాధ్యాయుడు శ్రీనివాససాంబ సుబ్రహ్మణ్యం ఇటీవల మృతిచెందాడు. అమలాపురంలో జరిగిన ఎస్టీయూ కార్యవర్గ సమావేశంలో రాష్ట్ర అధ్యక్షుడు లంకలపల్లి సాయిశ్రీనివాస్ బాధిత కుటుంబానికి ఎస్టీయూ అభయ్ స్కీము ద్వారా రూ.2లక్షలు అందించారు. జిల్లా ఎస్టీయూ ప్రధాన కార్యదర్శి ఎస్ఎస్ పల్లంరాజు, పి.గన్నవరం మండల ఎస్టీయూ అధ్యక్షుడు నల్లా బాలాజీ, రాష్ట్ర ఉపాధ్యక్షుడు చొప్పల రాంబాబు, బళ్ల శ్రీనివాస్, నీతిపూడి శ్రీనివాసరావు, బీవీ చౌదరి, కె.గోపాలకృష్ణ, రాణి శేషగిరిరావు, లక్ష్మణరావు, చిక్కం రవికుమార్ పాల్గొన్నారు.

బీవీసీలో పరిచయ్ 2కే-24

అమలాపురంరూరల్, సెప్టెంబరు29: ఇంజనీరింగ్ మొదటి సంవత్సరంలో చేరిన విద్యార్థులకు స్వాగతం పలుకుతూ సీనియర్లు భట్లపాలెం బీవీసీ ఇంజనీరింగ్ కళాశాలలో పరిచయ్2కే-24కార్యక్రమం నిర్వహించారు.ఈసీఈ, సివిల్, ఈఈఈ, కంప్యూటర్ సైన్స్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్సి తదితర బ్రాంచిలకు చెందిన సీనియర్ విద్యార్థులు జూనియర్ విద్యార్థులకు స్వాగతం పలుకుతూ నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలుఆకట్టుకున్నాయి. కళాశాల అధినేత బోనం కనకయ్య, ఛైర్మన్ కృష్ణసతీష్ విద్యార్థులను ప్రోత్సహిస్తున్న తీరును వివరించారు.ప్రిన్సిపాల్ డాక్టర్ జేవీజీ రామారావు, ఏవో జక్కం వెంకటకృష్ణారావు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్ మృతి

అంబాజీపేట, సెప్టెంబరు 29: మండలంలోని నందంపూడికి చెందిన ఆటోడ్రైవర్ రాయుడు శ్రీను(48) ఆదివారం మృతిచెందాడు. అంబాజీపేట సిద్ధివినాయ ఆటో యూనియర్ ఆధ్వర్యంలో ఆది వారం ఆటోలు నిలుపుదల చేసి సంతాపం తెలిపారు. పెచ్చెట్టి గోపి, షబీనా, రామకృష్ణ, వెంకటరమణ తదితరులు శ్రీను మృతికి సంతాపం తెలిపారు.

పీఆర్సీ జాప్యంతో మధ్యంతర భృతి ప్రకటించాలి

అమలాపురంటౌన్, సెప్టెంబరు29: పన్నెండవ పీఆర్సీ ప్రకటనలో ఆలస్యం అవుతున్నందున తక్షణం 30శాతం మధ్యంతర భృతిని ప్రకటించాలని ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు, ప్యాప్టో ఛైర్మన్ లంకలపల్లి సాయిశ్రీనివాస్ డిమాండ్ చేశారు. మధ్యంతర భృతిని రాష్ట్రంలో ఉద్యోగ, ఉపాధ్యాయులందరికీ ప్రకటించాలన్నారు. అమలాపురంలోని ఎస్టీయూ భవన్‌లో జిల్లా శాఖ అధ్యక్షుడు పోతంశెట్టి దొరబాబు అధ్యక్షతన ఆదివారం జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించారు. తొలుత సీతారామ్ ఏచూరి, చెరుకూరి రామోజీరావు తదితరుల మృతికి సంతాపం తెలిపి నివాళులర్పించారు. సంఘ కార్యకలాపాల వార్షిక నివేదికను జిల్లా ప్రధాన కార్యదర్శి సరిదే సత్యపల్లంరాజు ప్రవేశపెట్టారు. ఎస్టీయూ అభయ్ నివేదికను ఆర్కేఆర్ ప్రసాద్, ఉపాధ్యాయ వాణి నివేదికను కన్వీనర్ చిక్కం మైనర్‌బాబు ప్రవేశపెట్టారు.



సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు సాయిశ్రీనివాస్

అనంతరం ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర అధ్యక్షుడు సాయిశ్రీనివాస్ మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయులకు పెండింగ్ బకాయిలను వెంటనే చెల్లించాలని, సీపీఎస్ ఉద్యోగులకు పెండింగ్‌లో ఉన్న డీఏ ఎరియర్లు చెల్లించాలని, 2022నుంచి పెండింగ్‌లో ఉన్న సరెండర్ లీవ్‌లు బిల్లులు చెల్లింపునకు చర్యలు తీసుకోవాలని లేనిపక్షంలో ఉద్యమ కార్యాచరణ ప్రకటిస్తామని హెచ్చరించారు. పి.గన్నవరం మండలం కుందాలపల్లి మండల పరిషత్ పాఠశాలలో పనిచేస్తూ ఆకస్మికంగా మృతిచెందిన గోరుగంతు శ్రీనివాస సాంబసుబ్రహ్మణ్యం కుటుంబ సభ్యులకు ఎస్టీయూ అభయ్ స్కీమ్ ద్వారా రూ.2లక్షల చెక్కును అందజేశారు. సమావేశంలో రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు నాగిరెడ్డి శివప్రసాద్, ఆర్థిక కార్యదర్శి ఎస్.సత్యనారాయణ, రాష్ట్ర ఉపాధ్యక్షుడు చొప్పల రాంబాబు, వెలిగట్ల రత్నకుమారి, ఉమాపతి శాస్త్రి, వాసంశెట్టి వెంకటేశ్వరరావు, నల్లి ప్రసాద్, నరహరశెట్టి సత్యనారాయణ, నిమ్మన సత్యనారాయణ, కుంచే సిద్ధార్థప్రసాద్, కుడుపూడి హేమంత్‌శివకుమార్, వేమన వీవీ సత్యనారాయణ, మునగాల భవానీ, నందెపు శ్రీనివాస్, బాలనాగు గుప్తా, కడలి రంజిత్‌కుమార్ పాల్గొన్నారు.

రైతులకు డీసీసీ బ్యాంకు సేవలు

అంబాజీపేట, సెప్టెంబరు 29: డీసీసీ బ్యాంకు ద్వారా రైతులకు మరిన్ని సేవలు అందిస్తామని నోడల్ అధికారి పి.శ్రీనివాస్ అన్నారు. అంబాజీపేటలో బ్యాంకు అందిస్తున్న సేవలు, డిపాజిట్ల వివరాలు, లాకర్ల సదుపాయంపై అవగాహన కల్పించారు. రైతు నేస్తం పథకంలో భాగంగా ఎకరానికి రూ.1లక్షలు వంతున అందిస్తామన్నారు. బ్యాంకు అసిస్టెంట్ మేనేజర్ సత్య, అంబాజీపేట, చిరతపూడి సీఈవోలు కుంపట్ల అయ్యప్పనాయుడు, కేశనకుర్తి భీమరాజు, సొసైటీ సిబ్బంది పాల్గొన్నారు.

రైస్‌మిల్లర్స్ జిల్లా ఉపాధ్యక్షుడిగా శ్రీనివాస్



ఆలమూరు, సెప్టెంబరు 29: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడిగా మోదుకూరుకు చెందిన చుండ్రు శ్రీనివాస్ నియమితులయ్యారు. మిల్లర్స్ సమస్యల పరిష్కారంలో కీలకంగా ఉండే శ్రీనివాస్ సేవలను జిల్లా వ్యాప్తంగా ఉపయోగించుకోవాలని ఉద్దేశంతో జిల్లా ఉపాధ్యక్షుడిగా నియమించినట్లు జిల్లా అధ్యక్షుడు దాశంశెట్టి లక్ష్మీనారాయణ తెలిపారు. పలువురు రైస్ మిల్లర్స్ నాయకులు అభినందించారు.

దొమ్మేటి వెంకటరెడ్డి పేరిట అమలాపురంలో కల్యాణ మండపం


సభలో మాట్లాడుతున్న మంత్రి సుభాష్

అల్లవరం, సెప్టెంబరు 29: వందేళ్ల క్రితం శెట్టిబలిజ సంఘాన్ని స్థాపించిన దొమ్మేటి వెంకటరెడ్డి శెట్టిబలిజ కులస్థులకు దేవుడని, ఆయన పేరిట అమలాపురంలో కల్యాణ మండపాన్ని నిర్మించి నిలువెత్తు విగ్రహం ఏర్పాటుకు కృషి చేస్తానని కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు. అల్లవరం జడ్పీ హైస్కూల్ సెంటర్‌లో శెట్టిబలిజ సంఘ వ్యవస్థాపకుడు బర్మా కేసరి పతక గ్రహీత దొమ్మేటి వెంకటరెడ్డి భారీ విగ్రహాన్ని మంత్రి సుభాష్ ఆవిష్కరించారు. ఎంపీపీ యిళ్ల శేషగిరిరావు అధ్యక్షతన జరిగిన సభలో మంత్రి మాట్లాడుతూ రామచంద్రపురంలో కాపులు, శెట్టిబలిజ, ఇతర వర్గాలు సమష్టిగా గెలిపిస్తే చంద్రబాబు మంత్రి పదవి ఇచ్చి బాధ్యతను పెంచారని మంత్రి అన్నారు. ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్ మాట్లాడుతూ బర్మాలో వ్యాపారిగా పేరొంది జాతి వివక్షపై పోరాడిన దొమ్మేటి వెంకటరెడ్డి సేవలు చిరస్మరణీయమన్నారు. అల్లవరంలో శెట్టిబలిజ మండపం స్థలం కొనుగోలు, భవన నిర్మాణాలకు రూ.7లక్షల విరాళం ఇస్తానని కట్టా బ్రాహ్మాజీ ప్రకటించారు. స్థలదాత మామిడిశెట్టి సత్యనారాయణ, విగ్రహ దాత పాలిక శ్రీనివాస్ తదితరులను మంత్రి సుభాష్ సత్కరించారు. మున్సిపల్ ఛైర్‌పర్సన్ రెడ్డి సత్యనాగేంద్రమణి, పెచ్చెట్టి చంద్రమౌళి, చెల్లుబోయిన శ్రీనివాస్, కేవీ, యల్లమిల్లి బోస్, బొక్కా శ్రీనివాస్, చొల్లంగి రమణ, బొక్కా నాగేశ్వరప్రసాద్, రాయుడు విష్ణు, ఎస్.సుదర్శనరావు, సర్పంచ్ బొమ్ము బాలవేణి, ఎంపీటీసీ ఎస్.మౌనిక పాల్గొన్నారు. అల్లవరంలో మంత్రి సుభాష్‌కు అపూర్వరీతిలో స్వాగతం లభించింది.

బధిరుల కోసం ప్రత్యేక బడ్జెట్‌ను విడుదల చేయాలి


జిల్లాశాఖ బధిరుల సంఘ నూతన కార్యవర్గం

అమలాపురం, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): బధిరులు వారి సాంకేతిక భాషతో అంతకంతకు అభివృద్ధిని సాధిస్తున్నారని బధిర సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.శశికుమార్ చెప్పారు. బధిరులను ప్రోత్సహించాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందన్నారు. బధిరుల కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక బడ్జెట్‌ను విడుదల చేయాలని కోరారు. అమలాపురం ఎస్కేబీఆర్ కళాశాలలో ఉమ్మడి జిల్లా బధిర సంఘం ఆధ్వర్యంలో ఆదివారం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. కోనసీమ జిల్లా నలుమూలల నుంచి 200మంది బధిరులు హాజరయ్యారు. విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సంక్షేమశాఖ సూపరింటెండెంట్ యు.రాజు, కళాశాల ప్రిన్సిపాల్ ఎన్.శ్రీనివాస్ ఆధ్వర్యంలో ప్రపంచ బధిరుల దినోత్సవం నిర్వహించారు. శ్రీనివాస్ మాట్లాడుతూ బధిరులు అన్ని రంగాల్లోను అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. సూపరింటెండెంట్ రాజు మాట్లాడుతూ డిగ్రీ చదువుతున్న బధిరులకు ల్యాప్‌టాప్, ఇంటర్ పాసైన వారికి సెల్‌ఫోన్లు, ఇయరింగ్ ఎయిడ్స్ అందజేస్తున్నట్టు వివరించారు. బధిరులకు భోజన సదుపాయాన్ని ఎంపీ గంటి హరీష్‌మాధుర్ కల్పించారు. సాంకేతిక భాష అనువాదకుడు కారాడి రాజు ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. రాష్ట్రకమిటీ కోశాధికారి గ్రంధి శ్రీనివాస్ ఆధ్వర్యంలో జిల్లా కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా కె.శ్రీనివాస్, ఉపాధ్యక్షులుగా బి.నాగేశ్వరరావు, ఎం.రవితేజ, ప్రధాన కార్యదర్శిగా ఎ.సాయిమాధవ్, కోశాధికారిగా వి.మహేష్, సహాయ కార్యదర్శిగా జీఎస్‌పి ప్రసాద్, మహిళా కార్యదర్శిగా ఎ.మణి, కార్యవర్గ సభ్యులుగా ఎం.భవానీ, ఎం.అశోక్‌కుమార్, వై.చిరు, ఏవీ సాయికృష్ణను ఎన్నుకున్నారు.

బైపాస్ అక్రమాలపై సీబీఐతో విచారణ చేయించాలి

మామిడికుదురు, సెప్టెంబరు 29: పాశర్లపూడి నుంచి శివకోడు వరకు ఏర్పాటు చేస్తున్న బైపాస్ రోడ్డు నిర్మాణంలో జరిగిన అక్రమాలపై సీబీఐతో విచారణ చేయించాలని పాశర్లపూడి గ్రామానికి చెందిన బైపాస్ నిర్వాసితులు ఆదివారం నిరసన తెలిపారు. పాశర్లపూడిలోని బైపాస్ రోడ్డు పనులను నిర్వాసితులు అడ్డుకున్నారు. ఈరోడ్డు ఏర్పాటులో రియల్ ఎస్టేట్ వారికి, భూస్వాములకు లాభం చేకూరేలా అధికారులు సహాయ పడ్డారని ఆరోపించారు. భూస్వాములకు ఉపయోగపడేలా బైపాస్ రోడ్డును ఎలైన్‌మెంట్ మార్చి ఏర్పాటు చేస్తున్నారని ఆరోపించారు. అధికారులు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని ఆందోళన చేశారు. అక్రమాలపై సీబీఐతో విచారణ చేయించాలని డిమాండు చేస్తూ వినతిపత్రాన్ని రాష్ట్రపతి ద్రౌపదీముర్మకు అందిస్తున్నట్టు తెలిపారు. సీబీఐతో విచారణ చేయాలని నినాదాలు చేస్తూ పాశర్లపూడిలో ధర్నా చేశారు. పలువురు బాధితులు పాల్గొన్నారు.


పాశర్లపూడిలో ధర్నా చేస్తున్న బైపాస్ నిర్వాసితులు

అధ్వానంగా పుంత రోడ్లు

కె.గంగవరం, సెప్టెంబరు 29: రైతులు ఆరుగాలం శ్రమపడి పండించిన పంటలను పొలాల నుంచి తరలించుకోవడానికి ఉపయోగించే రహదారులు అధ్వానంగా ఉన్నాయి. కొన్ని రోజులుగా కురిసిన భారీ వర్షాలకు ఈపుంత రోడ్లు చిత్తడి చిత్తడిగా మారాయి. వైసీపీ ప్రభుత్వం ఈరహదారులను తీవ్ర నిర్లక్ష్యం చేసింది. దీంతో ఇప్పుడు వానలకు రైతులు ఈ రహదారుల్లో ప్రయాణం చేయాలంటే నరకం చూస్తున్నారు. ఈ రహదారుల మీదుగా వెళ్లి పొలం పనులు చేసుకోవడానికి, ఎరువులను తరలించుకోవడానికి చాలా ఇబ్బందులు పడుతున్నామని రైతులు వాపోతున్నారు. ఈపుంత రోడ్లను అభివృద్ధి చేయాలని రైతులు కోరుతున్నారు.



పామర్రులో పంట పొలాలకు వెళ్లే పుంత రోడ్డు

సిట్ దర్యాప్తుతో అసలైన దోషుల గుర్తింపు

అమలాపురం టౌన్, సెప్టెంబరు 29: తిరుమల లడ్డూ ప్రసాదం తయారీలో జరిగిన కల్తీని బయట పెట్టేందుకు సిట్ దర్యాప్తును ప్రారంభించిందని పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ చెప్పారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన అవకతవకలను వెలికితీయడంతో పాటు అసలైన దోషులను గుర్తించనున్నట్లు చెప్పారు. ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ చేపట్టిన ప్రాయశ్చిత్త దీక్షకు మద్దతుగా అమలాపురం గడియార స్తంభం సెంటర్‌లో రెండో రోజు ఆదివారం చిక్కం భీముడు ఆధ్వర్యంలో ప్రాయశ్చిత్త దీక్షా శిబిరాన్ని నిర్వహించారు. దీక్షా శిబిరంలో జనసేన నాయకులు కంకిపాటి వీరబాబు, దంగేటి శ్రీహరి, పిండి సురేష్, తిరుమల రమేష్, చింతపల్లి చిన్నా, పిల్లా ప్రసాద్, కంకిపాటి అరుణ్, చిట్నీడి శ్రీను, జానీ, వంగా శ్రీను తదితరులు పాల్గొన్నారు. దీక్షా శిబిరాన్ని పి.గన్నవరం ఎమ్మెల్యే సత్యనారాయణ సందర్శించి దీక్షాపరులకు నిమ్మరసం ఇచ్చిదీక్షను విరమింపచేశారు. కార్యక్రమంలో నాయకులు ఆకుల బుజ్జి, పిండి రాజా, గండి స్వామి, నిమ్మకాయల మను పాల్గొన్నారు.

బాలుడు రూ.15వేలు విరాళం

రాయవరం, సెప్టెంబరు 28: విజయవాడ వరద బాధితుల సహాయార్థం లొల్ల టీడీపీ కార్యకర్త పోతుల శ్రీనివాస్ కుమారుడు కిశాంత్ తన కిడ్డీ బ్యాంకు నుంచి రూ.15వేలు విరాళం అందజేశాడు. ఆదివారం ఈమేరకు రూ.15వేలు చెక్కును ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావుకు అందజేశారు. కార్యక్రమంలో లొల్ల సర్పంచ్ చాట్రాతి జానకి రాంబాబు, ఎంపీటీసీ వైట్ల సతీష్, టీడీపీ నేత సుంకవెల్లి గంగరాజు పాల్గొన్నారు.



దొంగతనాల జోరు

అంబాజీపేట, సెప్టెంబరు 26: మండలంలో దొంగతనాలు ఎక్కువగా జరుగుతున్నాయి. ఆలయాలకు, ఇంటికి ఒంటరిగా వెళ్లే మహిళలను టార్గెట్ చేసి గుర్తుతెలియని వ్యక్తులు మోటార్‌సైకిళ్లపై వచ్చి మెడలో ఉన్న పుస్తెలతాడు, బంగారు వస్తువులను లాక్కెళ్లిపోతున్నారు. మండలంలో రెండు నెలలుగా నలుగురు మహిళల నుంచి మంగళసూత్రాల తాడు, నల్లపూసలను అపహరించుకుపోయారు. దేవాలయాల హుండీల్లోని నగదు చోరీ, ఇంటికి తాళంవేసిఊరి వెళ్తే ఆ ఇళ్లల్లో దొంగతనాలు జోరుగా జరుగుతున్నాయి. గంగలకుర్రు అగ్రహారం పరిధిలోని పీర్నాయిపాలెంలో డ్రింక్ షాపు నిర్వహిస్తున్న ఓ మహిళ వద్దకు ఒక వ్యక్తి మోటార్‌సైకిల్ వచ్చి డ్రింక్, ఇతర వస్తువులు కొనుగోలు చేస్తున్నట్లు నమ్మించి ఆమె మెడలో ఉన్న బంగారు తాడును అపహరించుకుపోయాడు. గంగలకుర్రు అగ్రహారంలో జూలై14న రాచపాలెంలో ఇంటిలో ఎవరూలేని సమయంలో దొంగతనం జరిగింది. వెండి వస్తువులు, నగదును అపహరించారు. ఆగస్టు8న ముక్కామలలో షాపు కట్టి ఇంటికి వెళ్తున్న మోరంపూడి నాగమణి మెడలో ఇద్దరు వ్యక్తులు మోటార్‌సైకిల్‌పై వచ్చి మంగళసూత్రాలు, బంగారుతాడును తెంపుకుని పట్టుకుపోయారు. ఆగస్టు 23న గంగలకుర్రు అగ్రహారంలో గ్రంధి మహాలక్ష్మి స్థానిక శివాలయం నుంచి ఇంటికి వెళ్తున్న సమయంలో గుర్తుతెలియని వ్యక్తులు మోటార్‌సైకిల్‌పై వచ్చి ఆమె మెడలో ఉన్న బంగారుతాడు, నల్లపూసలతాడు అపహరించుకుపోయారు. సెప్టెంబరు 9న కముజువారిలంక వినాయకుడి వద్ద శ్రీపాద సీతారామలక్ష్మి పూజలు నిర్వహి స్తుంది. అక్కడికి గుర్తుతెలియని వ్యక్తి వచ్చి దేవుడికి నమస్కారం చేసుకుని హుండీలో డబ్బులు వేస్తున్నట్లు నమ్మించి పక్కనేఉన్న ఆమె మెడలో నల్లపూసలతాడు, మూడుపేటల బంగారుతాడు, సూత్రాలు వెరశి ఆరుకాసులు అపరించాడు.. కె.పెదపూడి, మొసలపల్లి తదితర గ్రామాల్లోని దేవాలయాల్లో ఉన్న హుండీల్లోని నగదు చోరీకి గురవుతున్నాయి. వరుస దొంగతనాలుజరుగుతున్నా పోలీసులు పట్టించుకోవడంలేదని ప్రజలు విమర్శిస్తున్నారు. శనివారం అర్ధరాత్రి అంబాజీపేట పోస్టాఫీసు సమీపంలోని విజయలక్ష్మి ఏజెన్సీ ఎరువుల షాపులో ఉన్న రూ.70వేల నగదును గుర్తుతెలియని వ్యక్తి అపహరించాడు. సీసీ కెమెరాలో దొంగతనం చేసిన దృశ్యాలు రికార్డు అయ్యాయి.


అంబాజీపేట ఎరువుల షాపు సీసీ కెమెరాలో రికార్డు అయిన దొంగతనం దృశ్యం

బాలాజీ పెదకాపునకు సన్మానం



మలికిపురం, సెప్టెంబరు 29: మార్క్‌ఫెడ్ రాష్ట్ర డైరెక్టర్‌గా నియమితులైన జనసేన పార్టీ రాజోలు నియోజకవర్గ సమన్వయకర్త గుండుబోగుల నరసింహారావు (పెదకాపు)ను శివకోటి మంగెన గంగయ్య తెలగా సంక్షేమ సంఘ నాయకులు దుశ్శాలువాతో సన్మానించారు. తెలగా అభ్యుదయ సంఘం నాయకులు అడబాల శ్రీఆంజనేయులు, చిక్కాల వెంకట్రావు, దూది స్వామి, కుంపట్ల చిన్నారి, అడబాల బాపయ్యనాయుడు, ఆకుల రమణ, రావి మురళీ, నామన నాగభూషణం, పిండి సత్యనారాయణ, తారక్ పాల్గొన్నారు.

తిరుపతి లడ్డూలో నెయ్యి కల్తీపై ర్యాలీ

మలికిపురం, సెప్టెంబరు 29: తిరుపతి లడ్డూ ప్రసాదంలో జరిగిన తప్పును ఖండిస్తూ భూపరిరక్షణ సమితి ఆధ్వర్యంలో పడమటిపాలెం భూసమేత వేంకటేశ్వరస్వామి ఆలయం నుంచి గ్రామంలో ఉన్న ఆలయాలను కలుపుకుంటూ గ్రామంలో దీపాలతో ర్యాలీ నిర్వహించారు. వేంకటేశ్వరస్వామివారిని క్షమాపణ కోరారు. పడమటిపాలెం సర్పంచ్ ఆకుల మాధవీలత, అడ్డాల కాశీ, అడ్డాల చిన్నారి, ముత్యాల తాతంబాబు తదితరులు పాల్గొన్నారు.

క్రియేటివ్ ఆర్ట్‌లో రీజెన్సీ విద్యార్థుల ప్రతిభ

యానాం, సెప్టెంబరు29: క్రియేటివ్‌ఆర్ట్స్ 9వ వార్షికోత్సవం సందర్భంగా కాకినాడ న్యూ సెంచరీ పాఠశాలలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి ఆర్ట్ అండ్ క్రాఫ్ట్ పోటీల్లో యానాం రీజెన్సీ పాఠశాల విద్యార్థులు కొల్లు భావనా సుజన, డి.సురేంద్ర ప్రతిభ కనబరిచారు. వీరిని నిర్వాహకులు సత్కరించి ప్రశంసా పత్రాలు అందజేశారు. విద్యార్థులను, చిత్రకళను ప్రోత్సహిస్తున్న ఉపాధ్యాయురాలు ప్రశాంతిలను పాఠశాల హెచ్ఎం టీవీఎస్ఎస్‌పీ ప్రసాదరావు అభినందించారు.

పిళ్లైయ్యార్ స్వామి ఆలయంలో భారీ అన్నదానం

యానాం, సెప్టెంబరు 29: గణపతి నవరాత్రి మహోత్సవాల ముగింపు సందర్భంగా స్థానిక పిళ్లారాయ వీధిలోని పిళ్లైయ్యార్ స్వామి ఆలయం వద్ద కమిటీ ప్రతినిధులు, భక్తుల సహకారంతో భారీ అన్నసమారాధన నిర్వహించారు. పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు స్వామి వారిని దర్శించుకుని అన్నసంతర్పణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. యానాం పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు స్వామివారి అన్నప్రసాదం స్వీకరించారు.

వెంకన్న ఆదాయం రూ.2.93లక్షలు

ఆత్రేయపురం, సెప్టెంబరు 29: కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం వివిధప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. వివిధ సేవల ద్వారా ఒక్కరోజు ఆదాయం రూ.2,93,821లభించినట్టు ఉపకమిషనరు ఈవో నల్లం చక్రధరరావు తెలిపారు. అలాగే ఆయన ఆలయంలో పర్యటించారు. క్యూలైన్ల విస్తరణ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. గోక్షేత్రం, కేశఖండన, పార్కింగ్, తిరువీధులలో ఆయన పర్యటించి సిబ్బందికి సూచనలు అందచేశారు. వివిధ విభాగాల్లో పనిచేస్తున్న సిబ్బందికి సూచనలు అందజేశారు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు చేపడతామని హెచ్చరించారు. సిబ్బంది బాధ్యతగా పనిచేయాలన్నారు.

రామిరెడ్డిని పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే



రావులపాలెం, సెప్టెంబరు 29: రావులపాలానికి చెందిన స్వర్ణాంధ్ర కల్చరల్ అసోసియేషన్ వ్యవస్థాపకుడు పడాల రామిరెడ్డి సోదరుడు వీరరాఘవరెడ్డి మృతి చెందారు. దీంతో ఆదివారం మాజీ ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి రామిరెడ్డిని పరామర్శించి సంతాపం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కర్రి నాగిరెడ్డి, పడాల సూర్యనారాయణరెడ్డి, గొలుగూరి సత్యనారాయణరెడ్డి, కర్రి సత్తిరెడ్డి, పడాల వీరరాఘవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సమానంగా వేతనాలు చెల్లించాలంటూ నేడు ధర్నా

అమలాపురం టౌన్, సెప్టెంబరు 29: వివిధ ప్రభుత్వ శాఖలు, పథకాల్లో పనిచేస్తున్న అవుట్‌సోర్సింగ్ కాంట్రాక్టు, పార్టుటైమ్ తదితర ఉద్యోగులకు రెగ్యులర్ ఉద్యోగులతో సమానంగా వేతనాలు, సౌకర్యాలు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల30న జిల్లా కేంద్రాల్లో ధర్నాలు నిర్వహించనున్నట్టు సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నూకల బలరామ్ తెలిపారు. అమలాపురం సీఐటీయూ కార్యాలయంలో జరిగిన సమావేశంలో కాంట్రాక్టు, పార్టుటైమ్ ఉద్యోగులందరినీ రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. కలెక్టరేట్ ఎదుట జరిగే ధర్నాను అన్ని వర్గాల కంటింజెంట్ ఉద్యోగులు పాల్గొని విజయవంతం చేయాలని కోశాధికారి కె.కృష్ణవేణి, ఉపాధ్యక్షుడు ఎన్.భాస్కర్ కోరారు. సమావేశంలో మలక సుభాషిణి, సీత, దేవి, భువనేశ్వరి పాల్గొన్నారు.

రావులచెరువు బాధితులకు ఆర్థిక సాయం

అమలాపురం టౌన్, సెప్టెంబరు 29: రావులచెరువు విస్ఫోటం బాధితులకు ఆదివారం జీఎస్సార్ చారిటబుల్ ట్రస్టు తరపున ఆర్థిక సాయం అందజేశారు. ఈప్రమాదంలో ఏడుగురికి తీవ్ర గాయాలు కాగా తెలంగాణ రాష్ట్ర శెట్టిబలిజ సంక్షేమ సంఘం అధ్యక్షుడు గుత్తుల మీరాకుమార్ ఆధ్వర్యంలో ట్రస్టు తరుపున రూ.2.60లక్షలను అందజేశారు. ఆపదలో ఉన్న వారికి ట్రస్టు అందిస్తున్న సేవలు వివరించారు. మృతిచెందిన గొవ్వాల నాగలక్ష్మి కుటుంబానికి రూ.2లక్షలు, మిగిలిన గాయపడ్డ వారికి ఒక్కొక్కరికీ రూ.10వేలు చొప్పున ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమంలో సంఘ నాయకులు చెల్లుబోయిన శ్రీనివాసరావు, మట్టపర్తి నాగేంద్ర, సంసాని బులినాని, గొవ్వాల రాజేష్, పిల్లి నాగగోపాలకృష్ణ, పిల్లి గంగాధరరావు, దంగేటి రుద్ర, కేతా భానుతేజ, విత్తనాల శేఖర్, వాసంశెట్టి జగదీష్, దొమ్మేటి రాము, రెడ్డి సత్యనాగేంద్రమణి, కముజు రమణ, కుడుపూడి భరత్‌భూషణ్ పాల్గొన్నారు.

నేడు మండపేట మున్సిపల్ సమావేశం

మండపేట, సెప్టెంబరు29: మండపేట మున్సిపల్ కౌన్సిల్ సమావేశం సోమవారం ఉదయం జరుగుతుందని మున్సిపల్ కమిషనర్ టి.వి.రంగారావు తెలిపారు. మున్సిపల్ ఛైర్‌పర్సన్ పతివాడ నూకదుర్గారాణి అధ్యక్షతన జరిగే సమావేశానికి కౌన్సిలర్లు హాజరుకావాలని కోరారు. సమావేశానికి ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు, ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు హాజరవుతారన్నారు.

విద్యార్థులకు స్టడీ మెటీరియల్

అమలాపురం టౌన్, సెప్టెంబరు 29: అమెరికాలో స్థిరపడ్డ యర్రమిల్లి జయరామ్ రాజ్‌కమల్ ఫౌండేషన్ ప్రతి ఏటా నేషనల్ మెరిట్ మీన్స్ కమ్ స్కాలర్‌షిప్ పరీక్ష రాసే విద్యార్థులను ప్రోత్సహించేలా స్టడీ మెటీరియల్ అందజేస్తుంది. ప్రతిభ పరీక్ష ఆధారంగా ఎంపికైన విద్యార్థులకు రూ.1.25లక్షల విలువైన స్టడీ మెటీరియల్‌ను ఆదివారం ఆయా పాఠశాలల హెచ్ఎంల ద్వారా విద్యార్థులకు అందజేస్తున్నట్టు ఫౌండేషన్ సలహాదారు, ప్రముఖ గణితావధాని డాక్టర్ టీఎస్‌వీఎస్ సూర్యనారాయణమూర్తి తెలిపారు.

అముజూరులో భారీ అన్నసమారాధన

కె.గంగవరం, సెప్టెంబరు 29: అముజూరులో వరసిద్ధి వినాయకుడిని టీడీపీ సీనియర్ నాయకుడు, కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ తండ్రి వాసంశెట్టి సత్యం ఆదివారం దర్శించుకున్నారు. ఆలయంలో ఆయన పూజలు చేశారు. గణపతి నవరాత్రి ఉత్సవాల ముగింపు సందర్భంగా ఆదివారం భారీ అన్నసమారాధన నిర్వహించారు. 3వేలమంది భక్తులు స్వామివారి అన్నప్రసాదం స్వీకరించారు. టీడీపీ మండల అధ్యక్షుడు మరివాడ చిన్నికృష్ణ, నాయకులు ఎనుముల గోపాలకృష్ణ, మరివాడ బొజ్జియ్య, సీనియర్ న్యాయవాది వాకలపూడి జయశంకర్, సతీష్ శ్రీనివాస్, అంగర శ్రీనివాసరావు, టేకి చంద్రశేఖర్ పాల్గొన్నారు.

అంతర్జాతీయ సెమినార్‌కు రాంబాబు



అమలాపురం టౌన్, సెప్టెంబరు 29: బెంగళూరులో అంతర్జాతీయ స్థాయిలో నిర్వహించిన అత్యాధునిక వంతెనల నిర్మాణంపై నిర్వహించిన సెమినార్‌కు రాష్ట్రం నుంచి అమలాపురం పంచాయతీరాజ్ ప్రాజెక్ట్ డీఈఈ అన్యం రాంబాబు హాజరయ్యారు. కేంద్ర రోడ్లు, రవాణా, జాతీయ రహదారులశాఖ మంత్రి నితిన్ గడ్కరీ, పబ్లిక్ వర్క్స్ మినిస్టర్ సతీష్ జర్కోలీలు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. రాష్ట్రం నుంచి రాంబాబు ఒక్కరే పాల్గొనడం విశేషం.

బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడిగా రామకృష్ణ

అంబాజీపేట, సెప్టెంబరు 29: బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడిగా పుల్లేటికుర్రుకు చెందిన సంసాని రామకృష్ణ నియమితులయారు. బీసీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు కేశనేని శంకరరావు ఉత్తర్వులు అందించారు. బీసీల సంక్షేమానికి కృషిచేస్తానని రామకృష్ణ తెలిపారు.

ర్యాలి ఆలయ ఈవోగా రమణమూర్తి



ఆత్రేయపురం, సెప్టెంబరు 29: ర్యాలి జగన్మోహిని కేశవస్వామి ఆలయ ఈవోగా బీహెచ్వీ రమణమూర్తి బాధ్యతలు స్వీకరించారు. ఈయన రాజమహేంద్రవరం కోటి లింగాల ఈవోగా పనిచేస్తూ సాధారణ బదిలీల్లో ఇక్కడికి వచ్చారు. ఇక్కడ ఈవోగా పనిచేసిన కృష్ణచైతన్య కపిలేశ్వరం శివాలయం, వైష్ణాలయం ఈవోగా బదిలీ అయ్యారు. అలాగే ఆత్రేయపురం సబ్ రిజిస్ట్రార్‌గా ఎం.రత్నకుమార్, ఇరిగేషన్ ఏఈగా వెన్నా మాధవసాయిప్రసన్న బాధ్యతలు స్వీకరించారు.

సమసమాజ స్థాపనకు విద్యార్థులు ఉద్యమించాలి

అమలాపురం టౌన్, సెప్టెంబరు 29: సమాజంలో జరుగుతున్న దోపిడీ, పీడనలకు వ్యతిరేకంగా అవినీతి, అన్యాయాలను ఎదిరించి విద్యార్థులు ఉత్తమ పౌరులుగా ఎదగాలని ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఇ.భూషణం పేర్కొన్నారు. సమసమాజ నిర్మాణంలో విద్యార్థులు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. పీడీఎస్‌యూ 50వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఆదివారం మద్దాలవారిపేటలోని కళాశాల వసతిగృహంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు రేవు తిరుపతిరావు అధ్యక్షతన స్వర్ణోత్సవ సభ నిర్వహించారు. పీడీఎస్‌యూ ఆవిర్భావం గురించి ముఖ్య అతిథి భూషణం వివరించారు. విద్యార్థి సంఘ మాజీ నాయకుడు పొలమూరి మోహన్‌బాబు, ముత్తాబత్తుల శ్రీనివాసరావు, విప్పర్తి దుర్గాప్రసాద్, బూసి ప్రతాప్‌కుమార్ మాట్లాడారు. అక్టోబరు 24 ఉస్మానియా యూనివర్సిటీలో జరిగే స్వర్ణోత్సవ సభను విజయవంతం చేయాలని కోరారు.

ద్రాక్షారామ పంజాలో మజ్లిస్

ద్రాక్షారామ, సెప్టెంబరు 29: హిజాబుల్ అధినేత హసన్ నస్రల్లా ఇజ్రాయెల్ వైమానికి దాడిలో హత్యకాబడిన సంఘటనపై ఆదివారం ద్రాక్షారామ ఆషూర్ఖానయే హజరత్ అబ్బాస్ పంజాలో షియా ముస్లింలు మజ్లిస్ జరిపారు. మత గురువు మౌలానా అస్కరీ హుస్సేన్ నస్రల్లా జననం, విద్య, ఉద్యమంపాత్ర, హిజ్బుల్లాలో చేరిక, ఇజ్రాయెల్‌పై దాడులు తదుపరి ఇజ్రాయెల్ వైమానికి దాడుల్లో మరణం గురించి మజ్లిస్ రూపంలో వినిపించారు.

సినిమా గైడ్

అమలాపురం

వెంకటరమణ	: దేవర-1
శ్రీలలిత	: దేవర-1
శేఖర్ స్క్రీన్-1	: దేవర-1
శేఖర్ స్క్రీన్-2	: అయ్
రమా	: అయ్
గణపతి	: కమిటీ కుర్రోళ్లు
వెంకటపద్మావతిస్క్రీన్-1	: దేవర-1
వెంకటపద్మావతి స్క్రీన్-2	: గొర్రె పురాణం